ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

# స్నేహ

మార్చి 02, 2008

కథా నిలయం
శ్రీకాకుళం



# బడ్జెట్ అంటే ఆల్జీబ్రానా

# హ్యాపీ బర్త్‌డే

2008 మార్చి-2నుంచి
2008 మార్చి-8వరకు

బి. హాస్మిత
4సం॥, మార్చి-2
ప్రశాంతి-లెనిన్
రోటరీనగర్-ఖమ్మం

బి. చందన
2సం॥, మార్చి-3
దివ్య-రాజేష్
రాంనగర్-హైదరాబాద్

వి.రమ్య
1సం॥, మార్చి-5
గీత-రవిగౌడ్
సర్వేల్-మ॥నగర్

కె. మధుమిత
7సం॥, మార్చి-3
లక్ష్మి-పర్వతాలు
బిజినేపల్లి-మ॥నగర్

కె. అర్చన
5సం॥, మార్చి-8
పద్మ-రవి
అమరచింత-మ॥నగర్

పి. సాయిశ్రీ
1సం॥, మార్చి-2007
సుభద్ర-రమేష్
గుండాల-నల్లగొండ

జె. జీవన్‌కుమార్
మార్చి-6
అనిత-వేణు
దేవరకొండ-నల్లగొంగ

సాయి ప్రీతమ్
7సం॥, మార్చి-2001
బుజ్జి-రత్న మంజూష
కమలాపురం



కథా నిలయం

## శాస్త్రీయ అవగాహనతో

# సమాజాన్ని పునఃనిర్మించుకోవాలి

**మన అతిథి**

పేరు : ఎ.జి.యతిరాజులు
తల్లిదండ్రులు : మునెమ్మ, గోవిందస్వామి
పుట్టినస్థలం : గుడియాతం (తమిళనాడు)
పుట్టిన సంవత్సరం: **1936**
చదువు : బి.ఎ, హిందీలో ఎం.ఎ బిఇడి
ఉద్యోగం : చిత్తూరు జిల్లాలోని ఉన్నత పాఠశాలలో హిందీ టీచర్‌గా చేసి రిటైర్ అయ్యారు
ప్రవృత్తి : అధ్యయనం, సామాజికోద్యమ కృషి
రచనలు : తెలుగు, తమిళ, హిందీ భాషల్లో అభ్యుదయ గ్రంథాలను అనువదించడం. రాహుల్ సాంకృత్యాయన్ (రాహుల్‌జి) అత్యధిక గ్రంథాలను తమిళంలోకి అనువదించి గుర్తింపు పొందారు. విద్యా సంబంధమైన గిజూబాయ్ పుస్తకాలను ఏడు సంకలనాలుగా తెలుగులోకి అనువదించడం పేర్కొనదగినది.
గుర్తింపు : ప్రభుత్వ అవార్డులకన్నా ప్రజా ఉద్యమ సంస్థల సన్మానాలు అత్యధికంగా లభించాయి. అవి ఎంతో సంతృప్తిని కల్పించాయి. రాహుల్‌జి రచనల తమిళ అనువాదాల సందర్భంలో కేంద్ర ప్రభుత్వ దక్షిణ భాష సంస్థ అవార్డు, తమిళనాడు ప్రభుత్వ పురస్కారాలు లభించాయి.
ఇష్టపడేది : నిరంతర అధ్యయనం, సామాజిక మార్పుకు దోహదం చేసే కృషి
ఇష్టపడనివి : వృథాగా కాలక్షేపం చేయడం
లక్ష్యం : మన సమాజంలోని రుగ్మతలన్నీ నశించి సమానత్వం నెలకొల్పేందుకు జరిగే మహాప్రస్థానంలో కలిసి అడుగులు వేయడం. ప్రజలందరూ సుఖసంతోషాలు, ప్రశాంత వాతావరణంలో మనుగడ సాగించాలి. దానికి జరిగే మహోద్యమానికి నా వంతు పాత్ర సక్రమంగా నిర్వహించడం.

**పు**ట్టుక ఎవరి చేతిలో లేదు. పుట్టుక తర్వాతే కులం, మతం, భాష, ప్రాంతం, దేశం అనే విబేధాలు మానవునికి లభిస్తాయి. కనుక కులం, మతాల పేర్లతో ఒకరినొకరు కొట్టుకోవడం, చంపుకోవడం మానవత లక్షణంగా భావించలేము. అది నరహంతక మనోభావాల నుంచి, ఆర్థిక పీడన నుంచే వస్తుంది. ఈ పరిణామాన్ని మనమందరం అర్థంచేసుకుని విశాల దృక్పథంతో వసుధైక కుటుంబం అన్న మన ప్రాచీనుల స్ఫూర్తితో, శాస్త్రీయ అవగాహనతో మన సమాజాన్ని పునఃనిర్మించుకోవాల్సిన అవసరం ఎంతగానో వుంది. అందుకు మనమందరం కలిసికట్టుగా కృషిచేసి విజయం సాదిద్దాం.

ఎ.జి.యతిరాజులు

## ఈ సంచికలో....


| | | |
|---|---|---|
| టపా | ... | 2 |
| విజ్ఞాన వీచిక... | ... | 3 |
| నవ్వుల్... పువ్వుల్ | ... | 4 |
| సీరియల్ | ... | 8 |
| మనసా... తెలుసా | ... | 10 |
| సినిమా కబుర్లు | ... | 11 |
| బాలనేస్తాలు | ... | 12 |
| అట్టమీది కథ | ... | 14 |
| ఆరోగ్యం | ... | 17 |
| లాహిరి లాహిరిలో | ... | 20 |
| సలహాలు | ... | 22 |
| రుచి | ... | 23 |
| కొత్త పుస్తకాలు | ... | 24 |


## ఇంకా...


మంచిపుస్తకం ...6
ప్రజా స్వరాలు
ప్రణయ రవాలు




చూద్దామా ... 5
దేవాలయాల నేల

కథ ... 18
లోపలి వర్షం



## హృద్యంగా సాగిన కవర్

ఫిబ్రవరి 17 స్నేహ సంచికలో డా॥ వైద్య గారి ప్రకాశ్ ఆమ్టే విచిత్ర విశ్వం 'హేమలకసా' హృద్యంగా ఉంది. "కుంటి కాకి" కథ మాకు నచ్చింది. ఇంటికొచ్చిన వాళ్ళు ముద్దొస్తున్న 'పింకీ'ని పద్యం చెప్పమని అడిగితే... "పింకీ అక్కరకు రాని చుట్టం..." అని అందుకునే హాస్యపు చెణుకుతో సహా, నవ్వుల్ పువ్వుల్‌లో అన్ని జోకులు మమ్మల్ని సరదా లోకంలో విహరింపజేశాయి. 'వారెవా వారెన్' స్కెచ్‌లో అందించిన జిమ్ వారెన్ చిత్రాలన్నీ బహు చక్కగా ఉన్నాయి. వీరి చిత్ర విచిత్రమైన బొమ్మలు చూస్తుంటే, చిత్రాలను గీయటం నేర్చుకోవాలన్న కాంక్ష చాలా బలీయంగా కలుగుతోంది. "చూద్దామా"లో యాజీవ్ అందించిన 'హంపి' విశేషాలు మా కెంతో ఆనందాన్ని కలిగించాయి. ఓ మంచి పుస్తకంలో పేర్కొన్న విశేషాలు మహానటి సావిత్రి అభిమానులను, అలరింపచేస్తాయనడంలో సందేహం లేదు. అక్షర లక్షలు చేసే మాట అయిన 'నిజాయితీగా పని చేయాలి" అంటున్న మన అతిథి డాక్టర్ లాల్జీసింగ్‌ని కలుసుకోవటం మహదవకాశంగా భావిస్తున్నాం.

నేమాన సుభాష్ చంద్రబోస్,
ఇలిసిపురం, శ్రీకాకుళం.

## సందేశాన్ని అందించిన 'కుంటి కాకి'

17న అతిథిగా సిసిఎంబి డైరెక్టర్ ను పరిచయం చేసినందుకు ధన్యవాదాలు. యుపికి చెందిన డాక్టర్ లాల్జీసింగ్ గొప్ప సైంటిస్ట్. పద్మశ్రీ అవార్డు గ్రహీత. బాగా పేరెన్నికగన్న సిసిఎంబి డైరెక్టర్‌గా సేవలందించిన వ్యక్తిని పరిచయం చేసినందుకు అభినందనలు. కుంటి కాకి కథ సందేశాత్మకమైనది. నేటి సమాజంలో పుత్రరత్నాల స్వార్థం, తల్లిదండ్రుల ఎడల కపట ప్రేమ, వంచనకు అద్దం పట్టింది. సమాజ గమనం అలా వుంది మరి.

టి. శ్రీరామమూర్తి, గాజువాక,
విశాఖ.

## వెండి తెర పండు వెన్నెల

తెలుగు సినీ కళాభిమానుల హృదయాలలో సుస్థిర స్థానం ఎవరైనా ఆక్రమించారా? అని ప్రశ్నించుకుంటే ముందుగా మహానటి సావిత్రిగారే అని చెప్పుకోవాలి. ఏ మాత్రం సాంకేతిక నైపుణ్యం లేని నాటి రోజుల్లో ప్రజలు సినిమా ప్రేక్షకులుగా మారారంటే సావిత్రి వంటి కళాకారులే కారణం అని చెప్పవచ్చు. ఇల్లాలు, ప్రియురాలు, వదిన, తల్లి ... ఇలా ఏ పాత్రలోనైనా పరకాయ ప్రవేశం చేసినట్లు నటించటంతో పాటు అసభ్య, అశ్లీలతలకు తావు లేకుండా నాటికీ నేటికీ, ఏనాటికీ సరిరారు ఆమెకెవ్వరూ! అమావాస్య రోజులలో సైతం ఆమె సినిమా చూస్తే పండు వెన్నెలను తలపిస్తుంది. మరపురాని తార స్మృతుల పేర ఎందరో రచయితలు, విమర్శకులు, దర్శకుల జ్ఞాపకాలను మరోమారు స్మరింపజేసినందుకు ధన్యవాదాలు.

యర్రమోతు ధర్మరాజు,
ధవళేశ్వరం,
తూర్పుగోదావరి జిల్లా.

## కనువిప్పు కలిగించే కథ

ఈ వారం అనుబంధంలో "హేమలకసా" గురించి తెలుసుకున్నాం. బాబా ఆమ్టే గురించి కొంచెం తెలుసు. వారి చిన్నబ్బాయి డా॥ ప్రకాశ్ ఆమ్టే గురించి ఎంతో తెలుసుకున్నాం. 'కుంటి కాకి' కథ ఎంతో హృద్యంగా ఉంది. నేటి యువతకు ఇది కనువిప్పు కలిగించేలా వుంది. కొడుకు చేసిన మోసాన్ని పరంధామయ్య చక్కగా




తిప్పికొట్టాడు. ఇటు వంటి కథ... ఒక్కటి చాలు. జనంలో చైతన్యం కల్గిస్తుంది. రచయితకు ధన్యవాదాలు.

పక్కి బాలకృష్ణ,
విజయనగరం.

## ప్రకాష్ జంతు ప్రేమ అభినందనీయం

ఫిబ్రవరి 17న స్నేహలో శీర్షికలు బాగున్నాయి. ఉత్తర ప్రదేశ్ సింగ్ గారిని అతిథిగా కలుసుకోవడం బాగుంది. అన్ని రుచులు లేకున్నా హంపి దర్శనం అనటం బాగుంది. నటి, మహానటి సావిత్రి చరమదశ విషాదాంతం విషాదమే. బాదంఘీర్ బాగుంటుంది. షేర్ కింగ్ ప్రకాశ్ జంతు ప్రేమ అభినందనీయం. కార్టూన్లు బాగున్నాయి. కుంటికాకికి జోహార్లు చెప్పడం బాగుంది.

వాస్తు రామచంద్రరావు,
రాంజీనగర్,
నెల్లూరు.




## ఆహ్వానం

మీరు జోక్స్ బాగా వేస్తారా! వాటిని విన్న మీ స్నేహితులు, సహోద్యోగులు, ఇరుగుపొరుగు పడీపడీ నవ్వుతారా! మరైతే ఇంకా ఆలోచిస్తున్నారేంటండీ బాబూ. మా పాఠకులను కూడా మీ జోక్స్‌తో కడుపుబ్బా నవ్వించండి. గిలిగింతలు పెట్టండి. మీరు రుచికరమైన వంటలు, అల్పాహారాలు, పానీయాలు... చేస్తుంటారా. వెజ్, నాన్ వెజ్ కూరలు వెరైటీగా చేస్తుంటారా. వెంటనే ఓ కాగితం, పెన్నూ తీసుకోండి. మీరు మాకు పంపదలచుకున్న వంటకానికి కావాల్సిన పదార్థాలు, కొలతలు, వండే విధానం వివరంగా రాసి మాకు పంపండి. ప్రచురిస్తాం.

మా చిరునామా: ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాద్-20.

విజ్ఞాన వీచిక

**ఎస్. వెంకట్రావు**

# ప్రళయానికి 'స్వాగతం'




**ఒకవైపు తనను తాను నాశనం చేసుకుంటూ మరోవైపు వినాశనం తరువాత జీవించడానికి సన్నాహాలు చేసుకునే మనస్తత్వాన్ని ఏమందాం? మానసిక రుగ్మత అందామా! పచ్చిగా చెప్పాలంటే దీన్ని పిచ్చి అనాలి. ఉత్తర ధృవం దగ్గరలో పెద్ద గొయ్యి తవ్వి అందులో ప్రపంచంలోని అన్ని రకాల విత్తనాలనూ పాతిపెట్టి పరిరక్షించడానికి నార్వేకు చెందిన ఒక సంస్థ చేస్తున్న ప్రయత్నాల్లో సరిగ్గా ఆధునిక మానవ ప్రవృత్తిలోని ఈ విచిత్ర వైఖరే కనబడుతోంది.**

ప్రపంచ పంటల వైవిధ్య నిధి (గ్లోబల్ క్రాప్ డైవర్సిటీ ట్రస్ట్) అనే సంస్థ ఉత్తర ధృవానికి 1000 కిలోమీటర్ల దూరంలో గల ఒక మంచు దీవిలోని పర్వతంలో 120 మీటర్ల లోతు గొయ్యి తవ్వింది. గొయ్యి వెనుక భాగంలో మూడు విశాలమైన గదులు నిర్మించింది. సంవత్సరం పొడవునా మైనస్ 18 సెల్సియస్ డిగ్రీల వద్ద అత్యంత శీతలంగా ఉండే గదుల్లో ప్రపంచ వ్యాపితంగా సేకరించిన 2,68,000 రకాల విత్తనాలను భద్రపరచడానికి సన్నాహాలు చేసింది. ప్రస్తుతం ప్రపంచంలో సుమారు 22 లక్షల రకాల పంట విత్తనాలున్నాయని అంచనా. ఒక్కో రకం పంటకు రెండు విత్తనాల చొప్పున మొత్తం 45 లక్షల విత్తనాలను ఈ గదుల్లో ఉంచవచ్చునని చెబుతున్నారు. నార్వేకు చెందిన స్వాల్బార్డ్ సింధుశాఖలోని స్పిట్స్‌బర్గెన్ ద్వీపంలో ఈ భూగర్భ గదులు నిర్మించారు. దీన్ని 'స్వాల్బార్డ్ ప్రపంచ విత్తన ఖజానా' (స్వాల్బార్డ్ గ్లోబల్ సీడ్ వాల్ట్) అంటున్నారు. కొద్ది రోజుల క్రితమే యూరోపియన్ కమిషన్ అధ్యక్షుడు జోస్ మాన్యుయెల్ బర్రాసో, కెన్యాకు చెందిన పర్యావరణవేత్త, నోబుల్ బహుమతి గ్రహీత వంగారి మాతాయ్, నార్వే ప్రధాన మంత్రి జెన్స్ స్టోల్టెన్‌బర్గ్‌లు ఈ భూగృహంలోకి వెళ్లి గదులు తెరిచి మచ్చుకు కొన్ని విత్తనాలను భద్రపరిచి వచ్చారు.

స్వాల్బార్డ్ సింధుశాఖ వైశాల్యం రీత్యా ఆంధ్ర ప్రదేశ్‌లో నాలుగో వంతు ఉంటుంది. కాని అక్కడ నివసించే ప్రజలు 2,300 మాత్రమే. ఇంతటి దుర్గమమైన ప్రాంతంలో ఈ భూగృహాన్ని నిర్మించడానికి కారణమేమంటే అక్కడి వాతావరణమే. సముద్ర మట్టానికి 130 మీటర్ల ఎత్తున ఉండే ఈ ప్రాంతంలో నిల్వ ఉంచిన విత్తనాలు కొన్ని లక్షల సంవత్సరాలైనా చెక్కు చెదరకుండా ఉంటాయి. ప్రస్తుతం ఈ భూ గృహంలో ఒక కార్యాలయమూ, విద్యుత్తు సదుపాయాలూ, ఎయిర్‌లాక్ డోర్‌లూ ఏర్పాటు చేశారు. కాని ఈ ఏర్పాట్లు లేకపోయినప్పటికీ అక్కడి శీతలం వల్ల విత్తనాలు ఎన్నటికీ చెడిపోవు. అన్ని దేశాలనుండీ తమ తమ ప్రాంతాల్లో పండే పంటలకు చెందిన విత్తనాలను సేకరించి ఈ భూ గృహంలో ఉంచుతారు. భవిష్యత్తులో ఈ విత్తనాలు ఆయా దేశాల సంపదే అవుతాయని ప్రపంచ పంటల వైవిధ్య నిధి అధికారులు చెబుతున్నారు. విత్తనాల సేకరణ ఇప్పుడే మొదలైంది. ఎన్నాళ్లకు పూర్తి చేస్తారో ఇంకా తెలియదు.

ఇంతటి దుర్గమమైన ప్రాంతంలో కట్టుదిట్టంగా విత్తనాలు దాచడానికి కారణమేంటి? వాతావరణం వేడెక్కి ప్రపంచం జలమయమైపోతే... యుద్ధాల వల్లగానీ, లేక ఏ పిచ్చివాడో మీట నొక్కడం వల్లగానీ ప్రపంచంలో నిల్వ ఉంచిన అణుబాంబులన్నీ పేలిపోయి భూమ్మీద జీవజాలమంతా నాశనమైపోతే....లేక ఇతర ప్రకృతి వైపరీత్యాలవల్లనో, మానవుని తప్పిదాలవల్లనో పెద్ద ప్రాంతంలో జీవజాలం నాశనమైపోతే... అప్పుడు ఈ విత్తనాలను తీసుకుని తిరిగి పంటలు పండించుకోడానికి ఉపయోగపడతాయన్నది ఈ భూగృహ నిర్వాహకుల ఆలోచన. నిజంగా ఈ ముందు జాగ్రత్త మంచిదే. ఎంతో వ్యయప్రయాసలకోర్చి వారు చేస్తున్న ప్రయత్నం హర్షించదగిందే.

కాని యుద్ధాలతోనూ, అణు బాంబులతోనూ భూ గోళాన్ని ఎందుకు నాశనం చేసుకోవాలి? పిచ్చి వినియోగదారీ తత్వంతో వనరులన్నిటినీ తగలేసి వాతావరణాన్ని ఎందుకు వేడెక్కించాలి? మన వెర్రి చేష్టలతో భూగోళం నిండా ప్రళయాలు ఎందుకు సృష్టించాలి? ఇవన్నీ చేయకుండా ఆపగలిగితే అసలు ఇటువంటి భూగృహాలు నిర్మించాల్సిన అవసరం లేదుకదా! ఒక వేళ విత్తనాలను నిల్వ ఉంచేందుకు ఏర్పాట్లు చేసుకున్నా మానవ సృష్టిత ప్రళయం తరువాత వాటిని ఉపయోగించడానికి బతికి ఉండే వారెవరు? మూడో ప్రపంచ యుద్ధం తరువాత మానవులు ఎముకలతోనూ, రాళ్ళతోనూ కొట్టుకుంటారని ప్రఖ్యాత శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ చెప్పాడు. అంటే మానవ నాగరికత కొన్ని వేల సంవత్సరాలుగా నిర్మించుకున్నదంతా యుద్ధంతో నాశనమవుతుందని ఆయన భావన.

అందువల్ల ఇప్పుడు విజ్ఞత గల మానవాళి చేయాల్సింది ప్రళయానంతర జీవనానికి ఏర్పాట్లు కాదు, ప్రళయం రాకుండా ప్రయత్నాలు. ఇటువంటి విత్తన ఖజానాల వల్ల ప్రకృతి వైపరీత్యాలనుండి కూడా జీవవైవిధ్యానికి రక్షణ ఉంటుందని కొందరు చెబుతున్నారు. ఉదాహరణకు, ఏ పెద్ద గ్రహశకలమో భూమిని తాకి ఒక పెద్ద భూభాగాన్ని సర్వ నాశనం చేసిందనుకోండి! అక్కడ నాశనమైన పంటలకు చెందిన విత్తనాలను ఈ ఖజానా నుండి మళ్లీ తెచ్చుకోవచ్చు, లేక భూగోళం వేడెక్కడం వల్ల కొన్ని ప్రాంతాలు నీట మునిగిపోతే అక్కడి పంటలకు చెందిన విత్తనాలు పూర్తిగా నాశనం కాకుండా రక్షించుకోవచ్చు. దీని వెనుకనున్న ఈ సదాశయాలను కూడా కాదనలేం. అయితే 'ప్రళయ కాల విత్తన ఖజానా' వెనుకనున్న ముఖ్యమైన లక్ష్యం మాత్రం మానవ కారక ప్రళయాల నుండి రక్షణ మాత్రమే. ఈనాడు అమెరికా, రష్యాలతో పాటు ప్రపంచంలోని దజను దేశాలవద్ద పేరుకుని ఉన్న అణ్వాయుధాల్లో పదో వంతు పేలినా ప్రపంచం పదిసార్లు నాశనమై పోతుంది. వాటిని తగ్గించాలని ఒకవైపు డిమాండ్లు పెరుగుతుంటే మరోవైపు కొత్త కొత్త దేశాలు అణ్వాయుధాలు తయారుచేస్తున్నాయి. ఇప్పటికే భూమ్మీద, సముద్ర గర్భంలో (సబ్ మెరైన్లలో), సముద్రాల మీద (నౌకల్లో) ప్రపంచమంతా అమెరికా అణ్వాయుధాలు మోహరించి ఉంది. ఇప్పుడు అది అంతరిక్షంలో కూడా అణ్వాయుధాలు మోహరించడానికి ప్రయత్నిస్తోంది. ఇటీవల అంతరిక్షంలోనే క్షిపణితో ఢీకొట్టి పేల్చేసిన అమెరికన్ గూఢచారి ఉపగ్రహం అణు శక్తితో నడిచేదేనని, అందువల్లనే దాన్ని కిందపడనీయకుండా హడావిడిగా పేల్చివేశారని కొందరు నిపుణులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు అమెరికా ఇంధన వినియోగం తద్వారా జరుపుతున్న వాతావరణ కాలుష్యం గురించి కూడా విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. ప్రపంచ జనాభాలో 4 శాతం ఉన్న అమెరికా ప్రపంచ ఇంధనంలో 16 శాతం వినియోగిస్తోంది. 20 శాతం కాలుష్యాలకు అది కారణమవుతోంది.

అందువల్ల యుద్ధాలు, ప్రళయాలు వచ్చాక రక్షించుకోవడం ఎలా అనే దానికన్నా ఆ యుద్ధాలు, ప్రళయాలు రాకుండా ఆపడం ఎలా అన్నదాన్ని గురించి ఆలోచించడం, ఆచరించడం మానవాళి మొత్తానికి క్షేమదాయకం. మానవజాతి సమిష్టి పిచ్చితనంపై సమిష్టి విజ్ఞత పైచేయి సాధించిన్పుడే ఇటువంటి ఆలోచనలు ఆచరణ రూపం దాలుస్తాయి.

❋

నవ్వుల్-పువ్వుల్

## జుట్టు పట్టుకొనిరా

**మాస్టర్:** ఓరే రాము! వాడిని జుట్టు పట్టుకొని తీసు కొనిరా!!

**రాము:** నేను ఆ పని చేయలేను మాస్టర్

**మాస్టర్:** ఏరా?

**రాము:** వాడు నిన్నే తిరుపతికి వెళ్ళి వచ్చాడు.

క(రా రాజశేఖర్ రెడ్డి, దంతేరపల్లె.

## టికెట్లు

రైలు స్పీడుగా పోతోంది. అందులో ఇద్దరు ప్రొఫెసర్లు పిచ్చాపాటీ మాట్లాడు కుంటున్నారు. ఇంతలో టి.సి. ప్రవేశించాడు. అందరూ టికెట్లు చూపించారు. టి.సి. వీరి దగ్గరకొచ్చి "సార్! మీ టికెట్లు ఏవి?" అనడిగాడు. ఆ ఇద్దరు ప్రొఫెసర్లు సీరియస్‌గా జేబులు వెతుక్కొని ఆ తర్వాత ఆముదం తాగిన మొహం పెట్టారు.

"ఇంతకీ మీరు టికెట్లు కొనలేదన్న మాట" అన్నాడు టి.సి.

దానికి ప్రొఫెసర్లు "టికెట్లు కొనలేక కాదయ్యా బాబూ! మేమొచ్చింది మా ఫ్రెండ్‌ని రైలెక్కించడానికి. వాడు రైల్లో ఎక్కినట్లు లేదు" అన్నారు బిక్కమొహం వేసుకొని.

జె. శివనాగేశ్వరరావు,
ఐలవరం, గుంటూరు జిల్లా.

## ఎన్ని చేపలు?

**టీచర్:** గోపీ! మీ నాన్న గారు బజారుకు వెళ్ళి 16 చేపలు తెచ్చారు! అందులో నాకేమో నాలుగు, సోషల్ టీచర్ గారికి మూడు ఇస్తే ఇంకెన్ని చేపలు మీ అమ్మ కూర వండు తుంది?



**గోపీ:** అయ్యో టీచర్, మేము శాఖాహారులం!

## సీరియల్

**టీవీ సీరియల్ ప్రొడ్యూసర్:** కొత్త సీరియల్‌కి మీ దగ్గర కథ, టైటిల్.. ఏమైనా వున్నాయా మేడమ్!

**నూతన రచయిత్రి:** అ న ం వ గా న ం మొగుడు, కథ సంభాషణలు రెడీగా వున్నాయి.

మా ఆయన, నేను కలిసి ఉన్నంత వరకూ ఎన్ని వారాలైనా కొనసాగిం చవచ్చు.

జె. సుధాకర్ రావు,
పట్నాయక్, కాకినాడ.

## బారు జడ

**"ఈ రోజుల్లో ఇంత బారు జడలు ఎవరికున్నాయి? ఈ కురులు ఇలా ఉండడానికి ఏం వాడుతున్నారు మీరు?"**

"భజగోవిందం కంపెనీ వారి సవరం!"

## తిట్టే చిలక

"ఇంత ఖరీదు పెట్టి ఎందుకురా చిలక పంజరాలు తెచ్చావ్"? ఆశ్చర్యంగా అడిగాడు తండ్రి కొడుకుని.

"చుట్టాలు వచ్చినప్పుడు బండ బూతులు తిడుతుందని అమ్మేవాడు చెప్పాడు నాన్నా?"

"ఏదీ మరీ? ఇంటి నిండా ఇంత మంది వున్నా నోరు మెదపవేం?"

"నాన్న తరుపు వాళ్ళని చూస్తే తిట్టేవి కావాలని చెప్పి, అమ్మ కొనిపించింది మరి" చల్లగా చెప్పాడు కొడుకు.

## గ్యాస్ ఆదా

**డాక్టర్:** మీ వారి పరిస్థితి ఏమీ బాగోలేదు, ఫుడ్ ఎలర్జీ వచ్చింది. ఏం తిన్నారు?

**పేషెంట్ భార్య:** గ్యాస్ పొదుపు చెయ్యమన్నారండి!

**డాక్టర్:** దానికీ దీనికీ ఏంటి సంబంధం?

**పేషెంట్ భార్య:** వారానికి సరిపడా ఒకసారే వండేశాను. నిన్న తిన్న తిండి ఆఖరుది.

**డాక్టర్:** మరి మీక్కూడా రావాలిగా ఎలర్జీ?

**పేషెంట్ భార్య:** "అబ్బే... నేను రోజూ కొద్ది కొద్దిగా పొదుపుగానే వండుకు తింటున్నా."

డాక్టర్:......"....."....

తమ్మెర రాధిక,
తొర్రూరు, వరంగల్.









యాజీవ్

కథా నిలయం
శ్రీకాకుళం



**ఒకప్పటి కళింగ సామ్రాజ్యంగా వెలుగొంది, చారిత్రక, ఐతిహాసిక సాంప్రదాయాల నేపథ్యం కలిగిన రాష్ట్రం ఒరిస్సా. అసంఖ్యాకమైన దేవాలయాలు, వన్యప్రాణి సంరక్షణ కేంద్రాలు, ఆదిమ తెగలు, సముద్ర తీరాలు... అన్నీ కలిసి, ఈ రాష్ట్రాన్ని ఒక చక్కటి విహారయాత్రా స్థలిగా నిలిపాయి.**

# దేవాలయాల నేల

ఈ నేలపై జరిగిన కళింగ యుద్ధం తరువాత అశోక చక్రవర్తి శోకతప్తుడై, అహింసామార్గాన్ని, ఆ పిదప బౌద్ధాన్ని స్వీకరించాడు. ఇక్కడి నుండే బౌద్ధం దూరదూరాలకు వ్యాప్తి చెందింది. హిందూమతం ఈ ప్రదేశంలో స్థిరపడకముందు జైనమతం కూడా అభివృద్ధి చెందింది. చాలా రాజ్యాలలాగే ఇది కూడా విదేశీయుల దాడులకు గురైందే. పన్నెండవ శతాబ్ది ఈ రాజ్యానికి స్వర్ణయుగమని చెప్పవచ్చు. ప్రసిద్ధ రాజులైన చోడగంగదేవుడు, అనంగ భీమదేవుడు ఆ కాలంలో దీనిని పాలించారు. ఆ కాలంలోనే జగత్ ప్రసిద్ధి పొందిన జగన్నాథ దేవాలయాన్ని నిర్మించారు. ఒరిస్సా 'భారతదేశ ఆత్మ' అనీ 'దేవాలయాల నేల' అనీ అంటుంటారు. బహుశా మొత్తం దేశంలో ఉన్న గుళ్లకంటే ఒరిస్సాలోనే ఎక్కువ గుళ్లు ఉండవచ్చు. ఒరిస్సా రాజధాని భువనేశ్వర్‌కి సుమారు 60 కిలోమీటర్ల దూరంలో అతి ప్రాచీనమైన పూరి పట్టణం వుంది. భారతదేశంలోని నాలుగు అతి పవిత్ర ధామాలలో పూరి ఒకటి (మిగతావి ద్వారక, రామేశ్వరం, బద్రీనాథ్). పూరిలోని జగన్నాథ దేవాలయం హిందువులకు అతి పవిత్ర దేవాలయాల్లో ఒకటి. కానీ పర్యాటకులకు అది ఒక అద్భుత నిర్మాణం. ఈ దాదాపు 40,000 చదరపు అడుగుల దూరం విస్తరించిన ఈ దేవాలయంలో ఇంకా 120 చిన్న గుళ్లున్నాయి. గర్భగుడి మాత్రం 214 అడుగుల ఎత్తుంది. దేవాలయం ఎదుట ఉండే 11 మీటర్ల స్తంభం చూపరులను విస్తుపోయేలా చేస్తుంది. ఈ స్తంభానికి 16 ముఖాలు, వాటిపై అందమైన చెక్కడాలూ ఉంటాయి. ఈ గుడికి 6000 మంది అర్చకులుండటం విశేషం. గుడి అగ్రభాగాన దాదాపు 36 అడుగుల చుట్టు కొలతలో ఒక చక్రం ఉంది. దానిని 'నీలచక్ర' అంటారు. దానిని ఎనిమిది లోహాలతో (అష్టధాతు) తయారు చేశారు. ప్రతి రోజూ ఒక కొత్త జండాని దానికి కడతారు. గుడిలో కృష్ణ, బలభద్ర, సుభద్రల చెక్క విగ్రహాలున్నాయి. పూరి అనగానే గుర్తొచ్చేది జగన్నాథ రథయాత్ర. జూలై మాసంలో జగన్నాథ దేవాలయం నుండి దాదాపు 3 కి.మీ. వరకూ అత్యద్భుతంగా అలంకరించిన మూడు భారీ రథాలలో కృష్ణ, బలభద్ర, సుభద్రలు ప్రయాణమౌతారు. వేలాది భక్తులు లాగే ఈ రథాలు గుండిచ మందిరానికి వెళ్ళి, అక్కడ 5 రోజులుండి తిరిగి వెనక్కి వస్తాయి.

### కోణార్క్ దేవాలయం

పూరికి 35 కిమీ దూరాన ప్రపంచ ప్రసిద్ధి గాంచిన మరో కట్టడం ఉంది. యునెస్కో పరిరక్షణలో ఉన్న ఆ కట్టడమే కోణార్క్. ఈ సూర్యదేవాలయాన్ని క్రీ.శ. 1250 ప్రాంతంలో ఒకటవ నరసింహదేవ ఆధ్వర్యంలో నిర్మించారు. నల్లరాతితో చెక్కబడ్డ ఈ సూర్య దేవాలయం హిందూ నిర్మాణ శైలికి దర్పణం పడుతుంది. ఈ మొత్తం దేవాలయం ఒక రథం ఆకారంలో నిర్మించబడింది. అప్పట్లో సముద్ర కెరటాలు ఈ గుడిని తాకేవి. దీనిలో ముఖ్య గోపురం 227 అడుగుల ఎత్తులో ఉండేది. మొత్తం గుడికి 24 శిలా చక్రాలున్నాయి. అద్భుతమైన రీతిలో మలచబడ్డ ఏడు అశ్వాలూ ఉన్నాయి. ఈ ఏడుగుర్రాలు వారంలోని రోజులనీ, 24 చక్రాలూ ఒక రోజులోని గంటలనీ, చక్రాలలోని ఆకులు జాములనీ అంటారు. ఆ చక్రాలు సూర్య గడియారాల్లాగా ఉపయోగపడేవి. ఈ రెండు దేవాలయాలకీ సంబంధించి ఎన్నో ఆసక్తికరమైన పురాణగాథలూ చెబుతుంటారు. గుళ్లూ గోపురాలే కాక పూరి బీచ్, కోణార్క్ దగ్గర్లో వున్న చంద్రభాగ బీచ్‌లు పర్యాటకులను ఆకర్షిస్తాయి.

### చిల్కా సరస్సు

ఒరిస్సాలో మరో చూడదగ్గ ప్రదేశం చిల్కా సరస్సు. పూరికి దక్షిణంలో ఉండే ఈ సరస్సు ఆసియాలో అతి పెద్ద మంచినీటి సరస్సు. బే ఆఫ్ బెంగాల్ నుండి భారీ ఇసుక మేట వల్ల వేరు చేయబడి ఉంది. ఇది 1,100 చ.కిమీలలో వ్యాపించి విస్తృతమైన జంతు జాతులకీ, మొక్కలకూ ఆలవాలమైంది. దయా, భార్గవి, అనే నదులు దీనిలో కలుస్తాయి. ఈ సరస్సులో అనేక దీవులున్నాయి. అన్నీ చూడదగ్గవే! ఇది భువనేశ్వర్‌కి 120 కి.మీ. దూరాన ఉంది. శీతాకాలంలో ఈ సరస్సుకి వెళితే బోలెడన్ని పక్షుల్ని చూడవచ్చు. చాలా మంది పూరిలో గానీ, భువనేశ్వర్‌లో కానీ మకాం వేసి, కోణార్క్ చూడటానికి వెళతారు. కోణార్క్‌లో కూడా యాత్రీ నివాస్, పంథా నివాస్ ఉన్నాయి.

శిల్ప సౌందర్యాన్ని ఆస్వాదించాలనుకునే వారికి ఒరిస్సా కన్నుల పండగ చేస్తుంది. గుడి దర్శనాలు జరిగాక చాలా మంది దగ్గర్లోని బీచ్‌లకు వెళుతుంటారు. కానీ బీచ్‌ల దగ్గర కాస్త జాగ్రత్త అవసరం. అక్కడ నోరూరించే ఎన్నో పదార్థాలు తినమని ఆహ్వానిస్తున్నా మీ నోరు కట్టేసుకోవడం మంచిది. చూపులకు బాగుండే ఆ పదార్థాలు అత్యంత అనారోగ్యకరంగా ఉంటాయి. మంచి హోటళ్లలో భోజనం ఫరవాలేదు. ✻

# ప్రజా స్వరాలు ప్రణయ రవాలు




తెర

ఈ లోకం నీ కోసం
ఎంత పరితపించెనో
ఈ ధరిత్రి నీ రాకకు
ఎంత నిరీక్షించెనో
తోరణాలు తీరె జనం
బారులుగా నిలిచిరే
పద పదవే గీతమా
పదవే నా ప్రాణమా

**అంటూ విప్లవం (ఇన్‌క్విలాబ్) పాట రాసిన కవి మగ్దూం మొహియుద్దీన్. కమ్యూనిస్టు కార్మిక నాయకుడుగా, ప్రజా ప్రతినిధిగా, వీర తెలంగాణా పోరాట భాగస్వామిగా సుపరిచితుడైన మగ్దూం కవిగానూ అంత ప్రసిద్ధుడు. ఉర్దూలో ఆయన రాసిన కవితలు (ఇజమ్‌లు) గజ్జెల మల్లారెడ్డి, దాశరథి, సి.నారాయణ రెడ్డి, రాంభట్ల తదితరులు చక్కటి తెలుగులో అనువదించారు. గతంలో రెండు సార్లు వెలువడిన ఈ సంపుటాన్ని ఆయన శతజయంతి సందర్భంగా విశాలాంధ్ర వారు పునర్ముద్రించారు. తన కవితలన్నీ మగ్దూం ఉర్దూలో రాసినప్పటికీ ఈ చక్కటి అనువాదాల కారణంగా తెలుగు సాహిత్యకారులకే ఆయన సన్నిహితుడయ్యాడు. చాలా చోట్ల ఈ కవితలు శ్రీశ్రీని తలపిస్తాయి.**

ఈ కవితా సంకలనంలో మగ్దూం కవితలతో పాటు ఆయన జీవిత ప్రస్థానంపై సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు రాజ్‌బహదూర్ గౌడ్ రాసిన సవివరమైన పీఠిక చక్కటి ఆకర్షణ. మఖ్దూం వ్యక్తిత్వాన్ని అద్భుతంగా ఆవిష్కరించడంతో పాటు ఆ కాలపు సామాజిక రాజకీయ పరిస్థితులను కూడా కళ్లకు కట్టినట్టు చిత్రించడం విశేషం. ఏదో నిర్జీవమైన భాషలో నివాళి అర్పించడం గాక అర్థవంతమైన జీవిత పరిచయంగా నడుస్తుందా పీఠిక. 1908 ఫిబ్రవరి 4న పుట్టి 1969 ఆగష్టు 25న కన్నుమూసిన మఖ్దూం గురించి తెలుసుకోవడానికి బహుశా ఈ పీఠిక ఒక్కటే సరిపోతుంది. అబూ సయిద్ మహమ్మద్ మఖ్దూం మొహియుద్దీన్ ఖాద్రీ ఆధ్యాత్మిక విశ్వాసాలు అధికంగా గల కుటుంబంలో పుట్టాడు. బాల్యంలోనే తండ్రిని కోల్పోయాడు. తల్లి రెండవ పెళ్లి చేసుకోవడంతో ఆమెకూ దూరంగా పెరిగాడు. మతాభినివేశం గల పినతండ్రి బషీరుద్దీన్ ఆయనను పెంచాడు. అయితే పరమ భక్తుడి ద్వారానే చిన్నతనంలో రష్యా విప్లవం గురించి విన్నాడు. అంతంత మాత్రంగానే ఆయన బాల్యం గడిచింది.

పల్లెల్లో పెరిగినా హైదరాబాదులో చదువుకోవడానికి వచ్చాడు. అప్పుడు నిజాం నిరంకుశత్వం ఒకవైపు, ముప్పైల నాటి ఆకలి దశకంలో రెండవ ప్రపంచ యుద్ధ పూర్వ కల్లోల స్థితిగతులు మరో వైపు. తక్కిన దేశంతో పోలిస్తే హైదరాబాదులో స్వాతంత్ర్య పోరాట వాతావరణం తక్కువే అయినా ఇవన్నీ మఖ్దూం వంటి వారిని ప్రగతిశీల భావాలవైపు నడిపాయి. అప్పుడప్పుడే కమ్యూనిస్టు ఉద్యమానికి కూడా అంకురార్పణ జరుగుతున్నది. మఖ్దూం 1933–34లో కవిత్వం అందుకున్నాడు. తొలి కవితలలోనే సామ్రాజ్యవాదంపై ధ్వజమెత్తాడు. తర్వాతి కాలంలో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యనభ్యసించాడు. అప్పుడే బ్రతుకు తెరువు కోసం ఒక నవాబు దగ్గర చేరి ఆయన ప్రేయసికి ఇంగ్లీషులో ప్రేమలేఖలు రాసిపెట్టే విచిత్రమైన ఉద్యోగం చేశాడు (ఆ అనుభవం తర్వాత గోథే ప్రేమ లేఖలు పేరిట జర్మన్ కవి ప్రేమను తెలియజేసే పుస్తక రచనకు ఉపకరించింది). అప్పట్లోనే ఆయన రాసిన నాటకాలు రవీంద్రనాథటాగోర్ మన్నన పొందాయి. ఈ కాలంలో చాలా సరదాగానూ వుండేవాడట. సామ్రాజ్యవాద వ్యతిరేకత వంటపట్టించుకున్న మఖ్దూం రాజ్‌బహదూర్ గౌడ్ తదితరులు స్థాపించిన కామ్రేడ్స్ అసోసియేషన్‌లో భాగస్వామి అయ్యాడు.

మఖ్దూం రాజ్‌బహదూర్ గౌడ్, హమిదాలీ ఖాద్రి, గులాం హైదర్ తదితరులతో పాటు కమ్యూనిస్టు ఉద్యమంలో ముఖ్య పాత్ర వహించాడు. పార్టీ జీవితంలోనూ తాము ఎంత తమాషాగా వుండేవాళ్లమో రాజ్‌బహదూర్ రాసిన విషయాలు ఆసక్తి గొల్పుతాయి. రహస్య జీవితం, జైలు జీవితం వగైరాలన్నీ చూశాడు. 1952లో హుజూర్ నగర్ నుంచి శాసనసభకు ఎన్నికైనాడు. కమ్యూనిస్టు ఉద్యమంలో విభేదాల నేపథ్యంలో సిపిఐ వైపు వెళ్లిన ఆయన 1959 నుంచి 69 వరకూ శాసనమండలిలో వున్నారు. అనేక కార్మిక సంఘాలలో పనిచేశారు. పలు దేశాలు పర్యటించారు. కవిత్వం మాత్రం వదలిపెట్టలేదు.

మఖ్దూం కవిత్వంలో ప్రధానంగా కనిపించేది సామ్రాజ్యవాద వ్యతిరేకత, అంతే స్థాయిలో ఫ్యూడలిజంపై ఆగ్రహం. వాటిని చీల్చిచెండాడతాడు. నరహంతకుడైన చైనా చక్రవర్తి షగ్‌ఫూర్‌ను దృష్టిలో పెట్టుకుని "షగ్‌ఫూర్ ఆత్మ" అంటూ సామ్రాజ్యవాదాన్ని చిత్రించాడు. జంగ్ హై జంగ్ ఆజాదీకీ (స్వాతంత్ర్య యుద్ధం) అన్న కవితలో 'యుద్ధం ఇది స్వాతంత్ర్య మహాయుద్ధం/ స్వాతంత్ర్య పతాక ఛాయలో సాగే యుద్ధం" అంటూ 'శత్రు వర్గముకు సమాధి కట్టని శాంతి యుద్ధముల కర్థమ్మేమిటి' అని ప్రశ్నిస్తాడు. జంగ్(రణం) కవితలో మఖ్దూం 'మర ఫిరంగి నోటి నుంచి/ మరణ గీతి మోగుతోంది' అంటూ సామ్రాజ్యవాద దమననీతిని శపిస్తాడు. 'నర రక్తం కారు చౌక/ సరుకైన విధమ్ము చూడు/ ఆకాశవిహారుల ఈ /అత్యాచారాలు చూడు/ జీవిత సంఘర్షణలో చితికిన ఈ బతుకులను చూడు' అని పిలుపునిస్తాడు.

బహుశా ఆయన కవితల్లో మకుటాయమానమైన వాటిలో 'హవేలీ' ఒకటి. దయ్యాల మేడ పేరిట దీన్ని గజ్జెల మల్లారెడ్డి గొప్పగా అనువదించాడు. 'అది ఒక దయ్యాల మేడ/ శిథిల సమాజాల నీడ/ పీనుగులను పీక్కు

తినే/ రాబందుల రాచవాడ/ ఆద్యంతం అంతులేని/ అరిష్టాల మహీపీడ' అని నిప్పులు కురిపిస్తాడు. అయితే ఇక్కడ కూడా ఆ భయానక స్థితిని వికృతాన్ని వర్ణించడంతో ఆగిపోకుండా 'రా, ఈ శిథిలాలపైన/ స్వాతంత్ర్య పతాకమెత్తు/ రా ఈ శిథిలాల మీద/ రక్త పతాకమ్మునెత్తు' అంటూ సమరాహ్వానం పలుకుతాడు.

సైకే కవులనబడే నిగూఢ కవులు వెలుతురు కన్నా చీకటిని, పగలు కన్నా రేయిని ఎక్కువగా వర్ణిస్తే మఖ్దూం చీకటిని చీల్చి పారేస్తాడు. అంధేరా (చీకటి) కవితలో 'మానవతా దేహంపై/ మానని ఒక రాచపుండు/ కందకాల ముళ్లకంచెలల్లుకున్న మృత్యువాటి' అంటూ అంధకారాన్ని పీడనకు ప్రతీకగా వర్ణిస్తాడు. అనుక్షణం ఉషోదయానికి స్వాగత గీతాలాలపిస్తాడు. ఇది ఆయన ఆశావాదానికి సంకేతం. సిపాహి (సైనికుడు) కవితలో 'అడుగుమా వెళ్లేటి సైనికు/ నతని గమనమెటకో' అని పిలుపునిస్తాడు.' ఎర్రబారెడి దిశాంచలమ్ముల/ కారుచీకటి తెరలు తొలగెను/ ప్రాణమా ప్రత్యూషమదిగో' అని భరోసా ఇస్తాడు. ' ఈ లోకం నీ కోసం ఎంత పరితపించెనో/ ఈ ధరిత్రి నీ రాకకు ఎంత నిరీక్షించెనో' అని విప్లవాన్ని ఆహ్వానిస్తాడు. ముస్తక్బిల్(భవిష్యత్తు) కవితలో 'వస్తున్నది వస్తున్నది నవజీవన పతాకాన్ని ఎగరేస్తూ వస్తున్నది' అంటాడు. మశరిక్ (తూరుపు) కవితలో ప్రాచ్య దేశాల మూఢత్వాన్ని దీనత్వాన్ని వర్ణించినప్పటికీ ముగింపులో మళ్లీ 'ఒక నవోజ్వల జగత్తు/ ఉదయించే వేళయింది/ఒక భవ్యసమాజ సృష్టి/ కావాహన జరుగుతోంది' అని విశ్వాసం ప్రకటిస్తాడు. తెలంగాణాపై "అడవులు కొండల/ అనుంగు బిడ్డలు/ పొలాల పొత్తిట పెరిగిన పాపలు/ లేచిరి క్రోధోధృత భీకరులై' తళ తళ మెరసెను కొడవలి/ ఎగసి ఎగసి నర్తించెను నాగలి' 'హలాలకూల జారుల పాలన/ పఠ్రెలు వారి బదాబదలయ్యేను' అంటూ రైతు బిడ్డల తిరుగుబాటుకు జేజేలు పలుకుతాడు.

ప్రజా కవిత్వ ప్రభంజనానికి తోడుగా ప్రణయ నాదాలు కూడా వినిపించడం మఖ్దూంలో ఒక ప్రత్యేకత. ఉర్దూ, పారశీక కవితల్లో ఇదో ప్రత్యేక శాఖగానే ఎదిగింది. దువ్వూరి రామిరెడ్డి అనువదించిన ఉమర్ ఖయ్యాం కవిత్వం, దాశరథి అనువదించిన గజల్స్ తెలుగు మాత్రమే వచ్చిన వారికి కూడా సుపరిచితాలే. ఇలాంటి వాటిలో ఒకటైన ఇజమ్ ప్రక్రియను మఖ్దూం ప్రధానంగా ఎంచుకున్నాడు. తొలి రోజులలో వలపు కవితలు రాసిన ఆయన యాభయ్యవ దశకం తర్వాత ఎక్కువగా వాటిని రచిస్తూ వచ్చాడు. ఈ సంకలనమే 'తూర్'(తొలివలపు) అన్న కవితానువాదంతో మొదలవుతుంది.' వలపు బంగరునావ/ వాహ్యాళిలో సొగసు/ ఎడదలో చెలరేగు/ సుడిగాలి పరవళ్లు/ అణువణువులో విద్యు/దావేశచలనమ్ము/ అంటూ ఈ నాటికీ నాకు జ్ఞాపకమ్మున్నది అంటూ ప్రవాహంలా సాగిపోతుందా గీతం. సిజ్దా(ఎవరో) అన్న కవితలో 'నా వూహలలో మళ్లీ/ నర్తించెను ఆ కొంటెది/మళ్లీ నా చూపులలో/ మసలుతోంది ఆ సుందరి అంటూ వర్ణించి 'ఎవరో నా శూన్య హృదం/ తస్నీమల నిమిడినారు/ ఎవరో నా బ్రతుకులోన/ విరియించిరి వసంతం' అంటూ ముగిస్తాడు. జవానీ, యాద్‌హై వగైరాలు కూడా ఈ కో వలోవే. ఈ కోవలో ఇంతెజార్ (నిరీక్షణ) చెప్పుకోదగింది. 'నా నిద్దురను కొల్ల/ గొన్న నా ప్రేయసీ/ నా అంతరాత్మలో/ నాట్యమాడే చెలీ/ రాగదే నా ప్రణయ రాజ్యాధిదేవతా' అని ఆలపిస్తాడు. తెలుగులో మనకు పరిచితమైన భావ కవుల వూహాసుందరి కవితలకూ వీటికి మధ్య స్పష్టమైన తేడా చూడగలుగుతాము. ప్రజా కవి, నాయకుడూ అయిన మఖ్దూం కలం నుంచి ఇవి వెలువడ్డంపై జరిగిన చర్చను వచ్చిన విమర్శలను కూడా రాజ్‌బహదూర్ తన ముందుమాటలో ప్రస్తావించి తగు విశ్లేషణ చేశారు. శ్రమకూ ప్రేమకూ కూడా ఈ సమాజంలో కొరతలేర్పడుతున్నాయి. ప్రణయం ద్వేషంతోనూ, శ్రమ దోపిడీతోనూ నిరంతర సమరం సాగిస్తున్నాయి అని పేర్కొన్నారు. చివరగా ఆయనకు ప్రణయ స్వేచ్ఛపై లేదా స్వేచ్ఛా ప్రణయంపై గాని నమ్మకాలు లేవని తేల్చి చెప్పారు. మొత్తంపైన మఖ్దూం శతజయంతి సంవత్సరంలో సాహిత్యాభిమానులు, సామ్యవాద ప్రియులు తప్పక చదవాల్సిన సంకలనం ఇది.

మఖ్దూం మొహియుద్దీన్ కవిత
అనువాదం: గజ్జెల మల్లారెడ్డి,
దాశరది,
సి. నారాయణరెడ్డి, రాంభట్ల కృష్ణమూర్తి
కౌముది
వెల: 40/-, పేజలు:90/-
ప్రతులకు:విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, అబిడ్స్,
సుల్తాన్ బజార్, హైదరాబాద్.








సాటాంటా



మూలం : బరీ మై హార్ట్ ఎట్ ఊండెడ్ నీ (డీ బ్రౌన్)
తెలుగు సేత: ముక్తవరం పార్థసారథి

కథా నిలయం
శ్రీకాకుళం

# అమెరికన్ డేగ

........................

జరిగిన కథ: రిజర్వేషన్‌కు వస్తున్న సాటాంటా, బిగ్‌ట్రీల కోసం పెద్ద ఎత్తున స్వాగతం పలకటానికి కియోవాలు అన్ని ఏర్పాట్లు చేశారు. నాయకులను జైల్లోనే వుంచటానికి బాల్డ్ హెడ్ టాటమ్ సర్వశక్తులా ప్రయత్నించాడు గాని కమిషనర్ ఆఫ్ ఇండియన్ ఆఫైర్స్ మాటే నెగ్గింది. టాటం రాజీనామా చేశాడు. అతడి స్థానంలో జేమ్స్ హావర్త్‌ను నియమించారు. బడ్ మూన్ గడిచి లీఫ్ మూన్ రుతువు ప్రవేశించే నాటికి లోన్‌వూల్ఫ్‌లో అసహనం పెరిగింది. ఇంకెన్నాళ్ళు వేచి చూడటం? నాయకులను తక్షణం విడుదల చెయ్యకపోతే టెక్సన్లతో యుద్ధం అనివార్యమన్నాడు. ఓపిక పట్టమన్నాడు కికింగ్ బర్డ్.

........................

(42వ భాగం)

**ఈ** సమావేశంలో ఇద్దరు నాయకులూ పాలు పంచుకున్నారు (పోలీసుల సంరక్షణలో). కియోవాలందరూ వేట మాని వ్యవసాయమే ప్రధానవృత్తిగా చేపట్టాలని సూచించాడు గవర్నర్. "ఎవరూ రిజర్వేషన్ వదిలిపోగూడదు. కావలసిన రేషన్లన్నీ ప్రభుత్వమే సరఫరా చేస్తుంది. మూడు రోజులకోసారి అటెండెన్సు తీసుకుంటారు. రోల్ కాల్‌కు హాజరుకాని వాళ్లను నేరస్తులుగా పరిగణిస్తారు. టెక్సాస్‌లో స్థిరనివాసం ఏర్పరుచుకున్న తెల్లవాళ్ళ మీద ఇండియన్లు దాడి చెయ్యగూడదు. వేట మానేసిన వాళ్లకు గుర్రాలెందుకు? మొక్కజొన్న పంట పెంచండి. అదే నాగరికతకు చిహ్నం. ఇప్పుడు నేను చెప్పినవన్నీ మీరు ఆచరిస్తున్నారని మాకు నమ్మకం గలిగే దాకా, సాటాంటా, బిగ్‌ట్రీలు ఇక్కడే జైలు జీవితం గడపక తప్పదు".

"మా నాయకులను ఇక్కడికి తీసుకురావటమే మీరు మాకు చేసిన మహోపకారం. వాళ్లను విడుదల చేసి పుణ్యం కట్టుకోండి" అంటూ అర్థించాడు లోన్‌వూల్ఫ్.

"వీలు పడదు" అంటూ సమావేశం ముగించాడు గవర్నర్.

కఠినమైన ఇన్ని షరతులకు లొంగి వుండటం కియోవా నాయకులకు అసాధ్యమని లోన్‌వూల్ఫ్‌కు తెలుసు. "గవర్నర్‌గారి వైఖరి మాకు నచ్చలేదు. మాకు శాంతి కావాలి. మీతో సహజీవనం కొనసాగించాలనే మేం చాలా త్యాగాలకు సిద్ధపడ్డాం. కాని ప్రతిసారీ వాషింగ్టన్ మమ్మల్ని మోసం చేసింది. చేసిన ఏ ఒక్క వాగ్దానమూ నిలబెట్టుకోలేదు మీ అధికారులు. ఇంక మాకు మిగిలిందేమిటి యుద్ధం తప్ప! ఇండియన్ తెగలను రూపు మాపటమే మీ ఆశయమైతే దానికి కూడా మేం సహకరించాలా?" అంటూ, అక్కడి స్కూల్ మాస్టర్‌తో తన ఆవేదన వెళ్లబోసుకున్నాడు లోన్‌వూల్ఫ్.

కొంత పిరికివాడైన కికింగ్‌బర్డ్‌కు కూడా కోపం తెప్పించింది గవర్నర్ వుపన్యాసం.

"మీరు చేసిన ద్రోహాలతో నా గుండె శిలగా మారింది. మీ పట్ల కోపమే గాని ప్రేమలేదిప్పుడు. మిమ్మల్ని నమ్మి స్నేహ హస్తం అందించాను. మీరు నా చేయి నరుకుతానన్నారు. మీరు మా మిత్రులు కారు. ప్రభుత్వం మమ్మల్ని మోసం చేసింది. మా మీద కుట్రలకు కపటనాటకాలకు రాజధాని వాషింగ్టన్" అన్నాడు.

సౌహార్ద సూచకంగా, ఖైదీలను విడుదల చెయ్యకపోతే, యుద్ధమూ, రక్తపాతమూ తప్పదని గ్రహించారు. మరునాడు ఉదయం తనను కలవమని లోన్‌వూల్ఫ్‌కు సందేశం పంపించాడు గవర్నర్. కియోవాలు చర్చించుకున్నారు. ఎవర్ని కలిసినా నష్టం లేదు. కాని అమలు కాని వాగ్దానాల వల్ల ప్రయోజనమేమి? ఈ నయవంచనను ఇంకెన్నాళ్లు భరించాలి? అందరూ సాయుధులై, మరికొంత మందిని గార్డ్ హౌజ్ (జైలు) వద్ద పహారా చెయ్యమని ఆదేశించి, సమావేశానికి వచ్చారు.

అక్కడ నెలకొన్న యుద్ధ వాతావరణాన్ని గమనించి, తక్షణం ఖైదీలకు పెరోల్ మంజూరు చేశాడు గవర్నర్. ఇప్పుడు వాళ్ళు స్వేచ్ఛగా తిరగొచ్చు. రక్షణ బాధ్యత ఏజెంట్‌దే. నెత్తుటి బొట్టు చిందించకుండా విజయం సాధించాడు లోన్ వూల్ఫ్.

"మూన్ వెన్ ది లీవ్స్ ఫాల్ ఆఫ్" సాటాంటా తన కొత్త టెపీ (గుడారం)లోకి మారాడు. తను బందీగా వున్నప్పుడే అనేక పరిణామాలు జరిగాయి. 'మంత్రశక్తి' గల బరిసెను పాత మిత్రుడు వైట్ కౌబర్డ్‌కిచ్చి

"ఇక నాకు నాయకుడిగా కొనసాగాలన్న కోరిక లేదు" అన్నాడు. స్వేచ్ఛ దొరికింది. అంతే చాలు. ఏజెన్సీ సరిహద్దులు దాటిపోవద్దన్న ఆజ్ఞను పాటించి, యువకులందరూ వేటకు బయల్దేరినప్పుడు ఆ బృందంలో చేరలేదు.

"గీస్ గోయింగ్ మూన్" రుతువులో, కొందరు తెల్ల టెక్సన్ దొంగలు కియోవా, కొమాంచీల మీద దాడిచేసి రెండు వందల గుర్రాలను అపహరించాడు. ఇండియన్లు వాళ్లను వెంబడించారు గాని ఆ దుండగులప్పటికే రెడ్ రివర్ దాటారు.

ఆ తర్వాత కొన్నాళ్లకు, ఇరవయ్యొక్క మంది ఇండియన్ యువకులు, పోగొట్టుకున్న

గుర్రాల స్థానంలో కొత్తవి సమకూర్చుకోవటానికి బయల్దేరారు.

టెక్సన్‌ల మీద దాడిచేస్తే మళ్ళీ సమస్యలు తలెత్తుతాయని మెక్సికో ప్రాంతంలో తమ గాలింపు కొనసాగించారు. దక్షిణంగా, అయిదు వందల మైళ్ళు ప్రయాణం చేసి, ఈగల్ పాస్, లారెడోల మధ్య రయోగ్రాండ్ వద్ద సరిహద్దు దాటి రెండు వందల మెక్సికన్ గుర్రాలను పట్టుకోగలిగారు. అయితే, ఆ ఘర్షణలో కొందరు మెక్సికన్‌లను చంపక తప్పలేదు. వచ్చేటప్పుడు దారిలో ఎదురైన మరో ఇద్దరు టెక్సన్‌లను కూడా కాల్చి చంపారు. ఇంకేం ఇండియన్ల కోసం సైనికుల వేట ప్రారంభమైంది. ఫోర్ట్ క్లార్క్ వద్ద తొమ్మిది మందిని హత్య చేశారు. హతుల్లో లోన్‌వూల్ఫ్ కొడుకు టాంకియా, మేనల్లుడు గీటన్‌లు కూడా వున్నారు.

మరి కొన్నాళ్లకు, చలి తీవ్రమైనప్పుడు, సైనికుల నుండి తప్పించుకుని తిరుగుతున్న ఇండియన్లు, ఫోర్ట్ సిల్‌కు చేరుకున్నారు. యుద్ధ వీరులను పోగొట్టుకున్నందుకు కియోవాలూ, కొమాంచీలు దీర్ఘ దుఃఖంలో మునిగిపోయారు. పుత్ర వియోగాన్ని భరించలేని లోన్‌వూల్ఫ్ తన జుత్తు కత్తిరించుకున్నాడు. టెపీ తగలబెట్టుకున్నాడు. గుర్రాలను చంపివేశాడు. ప్రతీకారమే జీవిత ధ్యేయమని ప్రకటించాడు. 1874 వసంతకాలంలో, మైదానాలలో గడ్డి ఏపుగా పెరిగింది. హతుల మృతదేహాలను తీసుకురావటానికి, కొందరు అనుచరులతో టెక్సాస్‌లోకి ప్రవేశించాడు లోన్‌వూల్ఫ్. రిజర్వేషన్‌లో రహస్యాలు దాగవు. లోన్ వూల్ఫ్ ప్రయాణం గురించి అధికారులకు తెలిసింది. రెడ్ రివర్ దాటకుండానే, కాంచో, మెకావెట్, క్లార్క్ ఫోర్ట్‌ల నుండి వచ్చిన సైనికులు వీళ్ళనడ్డుకున్నారు. అయినప్పటికీ, లోన్‌వూల్ఫ్‌తో సహ, మరి కొందరు తప్పించుకొని, సమాధి స్థలం చేరుకుని, మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. కాని కెవల్రీ సైనికులు వదల్లేదు. గత్యంతరం లేక, శవాలను కొండ దిగువన తిరిగి భూస్థాపితం చేశారు. ఆ తర్వాత, చిన్న చిన్న బృందాలుగా విడిపోయి సైనికులను ఎదిరించారు. ప్రాణనష్టమేమీ జరగలేదు. ఇండియన్లందరూ రెడ్ రివర్‌కు తిరిగి వచ్చేనాటికి ఎల్క్‌క్రీక్ వద్ద స్పెషల్ సన్‌డాన్స్ కోసం ఏర్పాట్లు జరుగుతున్నాయి.

ఆ సన్‌డాన్స్ సంబరాలు చేసుకోవటం అన్ని తెగలకూ ఆనవాయితీగా వస్తున్నదే. మొదట కియోవాలు, కొమాంచీలను, ఆహ్వానించారు. 1874 వసంతకాలంలో, కొమాంచీలు కియోవాలను తమ డాన్సులో పాల్గొనమన్నారు. పనిలో పనిగా కొన్ని తక్షణ సమస్యలు కూడా చర్చించవచ్చునని వాళ్ల ప్లాను. కికింగ్‌బర్డ్ ఆహ్వానాన్ని తిరస్కరించాడు. ప్రభుత్వ వ్యతిరేకులైన క్వాహడీలు దీన్ని ఏర్పాటు చేశారనుకున్నాడతడు. "ఎక్కడికీ వెళ్లక్కర్లేదు. జూలైలో మనమే ఒక డాన్సు నిర్వహిద్దాం" అని తన వాళ్ళనొప్పించాడు. కాని, తన కొడుకు, మేనల్లుడి అస్థికలను కూడా తీసుకురానివ్వని సైనికుల మీద పగతో రగిలిపోతున్న లోన్‌వూల్ఫ్, తరువాతి కార్యక్రమం చర్చించటానికి ఇదే సమయమని, అనుచరులతో వెళ్ళాడు. వెంట సాటాంటా కూడా వచ్చాడు. "రిజర్వేషన్ సరిహద్దుల్లోనే జరుగుతున్నది సన్‌డాన్స్. వెళితే వుల్లంఘన ఎలా అవుతుంది?" అనుకున్నాడు.

ప్రభుత్వంతో నిరంతరం పోరాడుతున్న క్వాహడీలు కూడా ఎల్క్‌క్రీక్ చేరుకున్నారు. మైదానాలలో తెల్లవాళ్ళు విచక్షణా రహితంగా పశువులను, ముఖ్యంగా అడవి దున్నలను (ఆహారం) నాశనం చేస్తున్నారని వార్త మోసుకొచ్చారు. అందువల్ల, దొరికినవాళ్లను దొరికినట్టే చంపేస్తున్నారు. చచ్చిన జంతువుల శవాలు కుళ్లి మైదానాలలో దుర్గంధం వ్యాపించింది. ఈ సెట్లర్ల ఆశయం ఒక్కటే! ఇండియన్లనూ, జంతువులనూ నాశనం చెయ్యటం.

(1872-1874 మధ్య 3,700,000 అడవి దున్నలను (బఫెలోలను) చంపారు. అందులో ఇండియన్లు చంపిన పశువుల సంఖ్య 150,000 మాత్రమే. ఈ దారుణాన్ని కొందరు తెల్లవాళ్ళు కూడా వ్యతిరేకించారు. "జంతువులను చంపి, వాటి చర్మాలు ఎగుమతి చెయ్యాలి. 'బఫెలోల' ను నాశనం చేస్తే తప్ప ఇండియన్ల జీవన పద్ధతి మారదు. వాళ్లకు నాగరికత 'నేర్పించాలంటే ఇలా చెయ్యాల్సిందే" అన్నాడు జనరల్ షెరిడాన్)

"పశు పక్ష్యాదులనూ, ప్రకృతినీ నాశనం చేసే నాగరికత మా కొద్ద"న్నారు క్వాహడీలు. కొమాంచీ సన్‌డాన్స్ తర్వాత, ఒక క్వాహడీ ప్రవక్త (పేరు ఇసాటాయ్), 'బఫెలో'ను రక్షించటానికి యుద్ధం చెయ్యక తప్పదని బోధించాడు. ఇసాటామ్‌కు మంత్రశక్తులున్నాయని అందరూ విశ్వసిస్తారు. "తలచుకుంటే నోటి ద్వారా వ్యాగన్ల కొద్దీ ఆయుధాలు కక్కగలడు. తెల్లవాళ్ల తూటాలను అరచేతితో ఆపగలడు"

ఇటీవలే నాయకుడిగా గుర్తింపబడిన క్వానా పార్కర్ కూడా సెట్లర్లను తరిమెయ్యటానికి యుద్ధం తప్పదన్నాడు. కెనడియన్ రివర్ సమీపంలో వున్న ఆడోబ్‌వాల్స్ (ఒక వాణిజ్య కేంద్రం)ను తామే మొదట ఎటాక్ చెయ్యాలని కూడా సూచించాడు.

"ఇళ్ల కప్పులకు రంధ్రాలు చేసి మరీ కాల్చాం" అన్నాడు క్వానా. తెల్లవాళ్లు, దగ్గరున్న తూటాలన్నీ కాల్చాక, దాడి చెయ్యాలన్నది ఇండియన్ల వ్యూహం. చాలాసేపు దాగుడు మూతలు కొనసాగాయి. ఎటాక్ కోసం ముందుకు లంఘించినప్పుడు క్వానా గుర్రానికి బుల్లెట్ తగిలి నేలకూలింది. క్వానా భుజానికి మరో బుల్లెట్ తగిలి నేల కూలింది. క్వానా బుజానికి మరో ములెట్ తగిలింది. ఆరోజు ప్రాణం పోవాల్సిందే గాని, ఒక ప్లమ్ పొద వెనక నక్కి, సాయంత్రం వరకు సురక్షిత ప్రాంతానికి చేరుకున్నాడు.

లోన్‌వూల్ఫ్

సన్‌డాన్స్ ముగిసే వేళకు, ఉత్తర మైదానాల నుండి షియోనీలు, అరాపాహోలు కూడా రిజర్వేషన్ చేరుకున్నారు. కొందరు గుర్రాల దొంగలు (తెల్లవాళ్లు) తమ యాభై మస్టాంగ్ (మెక్సికన్ అడవి గుర్రం)లను దొంగిలించినందుకు కోపంగా వున్నారు. అడవి దున్నలను చంపుతున్న తుంటరులే ఈ పని చేసి వుంటారు. అడోబ్ వాల్స్ మీద దాడి చెయ్యాలన్న క్వానా నిర్ణయం వాళ్లకు నచ్చింది. ఆ బృందంలో చేరతామన్నారు లోన్‌వూల్ఫ్, సాటాంటా. ఇతర కియోవా నాయకులు కూడా ఈ ప్రతిపాదనను సమర్థించారు. రిజర్వేషన్‌ను వదిలి వెళ్ళకూడదని నిబంధనలున్నప్పటికీ, తమ బఫెలో జాతి నాశనం కాకుండా రక్షించుకోవటం అంతకన్నా ముఖ్యం. ఇండియన్ల అవసరాల కోసం మాత్రమే ప్రత్యేకించిన బఫెలో మైదానాలలో తెల్లవాళ్ళు ప్రవేశించటం కూడా నేరమే గదా! ఈ సెట్లర్లను నిరోధించవలసిన బాధ్యత సైనికులది. వాళ్ళాపని చెయ్యకపోతే, తాము స్వయంగా రంగంలోకి దిగక తప్పదు.

ఏడువందల మంది ఇండియన్లు 'సమ్మర్ మూన్' కాలంలో బఫెలో రక్షణ కోసం పశ్చిమంగా కదిలారు. వెంట వచ్చిన ఇసాటామ్ అందరికీ మందులూ, తాయెత్తులూ పంచాడు. "బుల్లెట్లు మీకు తగలవు. ఈ మందుల మహిమ అలాంటిది. తెల్లవాళ్ల తుపాకులు పేలనే పేలవు. మీరు శత్రువులను నిశ్శేషంగా సంహరిస్తారు!"

జూన్27 తెల్లవారుజామున అడోబ్‌వాల్స్ పరిసరాలకు చేరుకున్నారు. ఇండియన్లు ఇక మెరుపుదాడి చేసి, బఫెలో వేటగాళ్లను తుడిచిపెట్టటమే తరువాయి.

"గుర్రాలు శరవేగంగా దౌడు తీశాయి. దుమ్ము లేచింది. ముందరేమున్నదీ చూడలేకపోయాం" అంటూ ఆనాటి అనుభవాన్ని నెమరువేసుకున్నాడు క్వానా పార్కర్. కుక్కలు రాకుండా తీసిన గోతుల్లో గుర్రాలు ముడుచుకు తూలిపడ్డాయి. కొన్నిటి కాళ్ళు కలుగుల్లో చిక్కుకుపోయాయి. కింద పడిన రౌతులకు గాయాలు తగిలాయి. ఎరుపురంగు పులుముకున్న మొహాలు మట్టికొట్టుకుని మరింత వికృతంగా కనిపించాయి. పారిపోవటానికి ప్రయత్నించిన ఇద్దరు తెల్లవాళ్లను చంపి స్కాల్ప్ చేశారు (స్కాల్పింప్ - తల చర్మం పీకెయ్యటం - శత్రువులను చంపినందుకు గుర్తుగా ఇండియన్ తెగలలో వున్న ఆచారం). తుపాకుల చప్పుడుకు వులికిపడ్డ సెట్లర్లు రైఫిళ్లతో ఎదురు కాల్పులు జరిపారు. వెనక్కు తగ్గిన ఇండియన్లు, వలయాకారంలో పునస్సమీకరించుకొని ముందుకురికారు. తుపాకులు, బరిసెలు కూడా శత్రువులను గాయపర్చాయి.

కొత్తగా కట్టుకున్న ఇళ్లవి. మట్టి ఇంకా పచ్చిగానే ఉంది.

"ఇళ్ల కప్పులకు రంధ్రాలు చేసి మరీ కాల్చాం" అన్నాడు క్వానా. తెల్లవాళ్లు, దగ్గరున్న తూటాలన్నీ కాల్చాక, దాడి చెయ్యాలన్నది ఇండియన్ల వ్యూహం. చాలాసేపు దాగుడు మూతలు కొనసాగాయి. ఎటాక్ కోసం ముందుకు లంఘించినప్పుడు క్వానా గుర్రానికి బుల్లెట్ తగిలి నేలకూలింది. క్వానా భుజానికి మరో బుల్లెట్ తగిలి నేల కూలింది. క్వానా భుజానికి మరో బుల్లెట్ తగిలింది. ఆరోజు ప్రాణం పోవాల్సిందే గాని, ఒక ప్లమ్ పొద వెనక నక్కి, సాయంత్రం వరకు సురక్షిత ప్రాంతానికి చేరుకున్నాడు.

"బఫెలో హంటర్స్ వద్ద పెద్ద తుపాకులున్నాయి. గురి చూడటానికి వాటి మీద టెలిస్కోపులు కూడా అమర్చారు" అంటూ తరువాత వాంగ్మూలమిచ్చాడు ఒక కొమాంచీ యోధుడు.

**ఇంకా వుంది....**

మనసా... తెలుసా?

హిప్నో కమలాకర్

ఫోన్ నెం: 9390044031

## చదువుపై ఏకాగ్రత కుదరాలంటే....



నా వయస్సు 25 సంవత్సరాలు. నేను డిగ్రీ రెండవ సంవత్సరం చదువుతున్నాను. నాకు బాగా చదువుకోవాలని వుంది. కాని చదువుపై ఏకాగ్రత కుదరడం లేదు. చదవడానికి కూర్చుందామంటే ఏవేవో ఆలోచనలు వస్తుంటాయి. చదువుపై ఏకాగ్రత రావడం లేదు. నేను అప్పుడప్పుడు నత్తిగా మాట్లాడుతుంటాను. దయచేసి మంచి సలహా ఇవ్వగలరు?

**వరుణ్, నల్గొండ.**

బాగా చదవాలనే ఆలోచన మంచిదే కాని దానికి తగిన విధంగా ఎటువంటి ప్రయత్నం చేస్తున్నావు? చదువుని అవసరంగా భావించు. చదవడం వలన మంచి భవిష్యత్తు ఉంటుంది. చదువు నాలెడ్జ్‌ని పెంచుతుంది. నీవు జీవితంలో ఎదగడానికి దోహదం చేస్తుంది. చదువుని అవసరంగా భావించినప్పుడు బాగా చదవగలుగుతావు. నత్తిగా మాట్లాడటం వల్ల మీలో ఆత్మన్యూనతా భావం వుంటుంది. ఇది అలవాటుకు సంబంధించిన సమస్యేనని గుర్తించడం ద్వారా నత్తి నుండి బయటపడే అవకాశం ఉంది. నత్తికి దోహదం చేసే ఆందోళన, కంగారు, భయం వంటి సమస్యని ముందుగా అధిగమించండి. సెల్ఫ్ హిప్నాసిస్, సైకో థెరపిస్ట్‌చే థెరపీ తీసుకోవటం ద్వారా ఈ సమస్యను అధిగమించవచ్చు.

## పరీక్ష హాల్లో....ఏం గుర్తుకు రాదు

నేను పాలకొండ గురుకుల పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాను. నేను చదివిన జవాబులు పరీక్ష ముందు వరకు గుర్తుంటాయి. పరీక్ష హాల్‌లోకి వెళ్తే ఏమీ గుర్తుండదు. కానీ పరీక్షకి వెళ్ళే సరికి ప్రశ్నలు అర్థం కాక ఒక దానికి ఒకటి కలిసిపోతూ గందరగోళంగా నా మైండ్ ఏం పని చేయదు. ఎక్కువగా చదువుతాను. కాని చదివినది మరచిపోతాను. జ్ఞాపక శక్తి పెరగాలని ఉంది. గాని ఏం చేయాలో నాకు తెలియదు. నాకు మంచి సలహా ఇవ్వగలరు?

**వినయ్ కుమార్, శ్రీకాకుళం.**

కారు నడపడం ఎలాగో నేర్పించినట్లు మనకు నడకను ఏవ్వరూ నేర్పించరు. స్వయంగా పలు రకాల ప్రయత్నాలు చేసి, దాన్ని రూఢి పరుచుకొని అనుసరించడం మొదలు పెడతాం. మీరు నేర్చుకోవటంలోనే గందరగోళ పరిస్థితులను సృష్టించుకుంటున్నారు. మీరు చదివే ప్రతి విషయాన్ని అర్థం చేసుకోవడం దానికి సంబంధించి నోట్సు రాయడం, మీ స్నేహితులతో ఆ టాపిక్ పైన చర్చించడం దైనందిన జీవితంలో సంఘటనలను ఆ పాఠ్యాంశానికి జత చేయడం వంటివి చేయడం వల్ల మీరు నేర్చుకున్నది మీ మైండ్‌లో చిరస్థాయిగా నిలిచిపోతుంది. మీరు చదవబోయే పాఠ్యాంశాలపై ఆసక్తిని, ఇష్టాన్ని పెంచుకోండి. ఏ విషయాన్నైనా అరగంట సేపు చదవండి. ఈ విధంగా చదువుకోవడానికి సమయాన్ని విభజించుకోండి. అలా గ్యాప్ ఇచ్చి చదవటం వలన ప్రతి విషయం బాగా గుర్తుండిపోతుంది. మీరు పరీక్షలు రాసేటప్పుడు ప్రశ్నలను ఒకటికి రెండు సార్లు చదవండి. మీకు బాగా వచ్చిన వాటికి టిక్ పెట్టుకోండి. అలా టిక్ పెట్టినవి రాసిన తరువాత మిగతావాటిని చూడండి. మీరు రెగ్యులర్‌గా స్కూలుకి వెళ్ళినా, ఏ రోజు పాఠ్యాంశాలను ఆ రోజు చదివినా మిగిలిన వాటిని పరీక్షల్లో చక్కగా రాయగలుగుతావు.

## జ్ఞాపకశక్తి తగ్గుతోంది

చదవలేక పోతున్నాను. నేను ఐదవ తరగతి వరకు క్లాస్ ఫస్ట్ వచ్చాను. కాని ఆరవ తరగతిలో చదవ లేక జ్ఞాపక శక్తి తగ్గిపోతోంది. అందరికంటే వెనుకబడిపోతున్నాను. దానికి మీరే సలహా ఇవ్వాలి?

**శ్వేత, గంగారం.**

నీవు ఐదవ తరగతి వరకు ఫస్ట్ వచ్చావు కాబట్టి నీ జ్ఞాపకశక్తి ఎక్కడికీ పోదు. విషయాలను సరిగ్గా నేర్చుకోలేక పోయినా, చదవటంలో బద్ధకించినా, ఇష్టంలేకపోయినా జ్ఞాపకశక్తి సరిగ్గా వుండదు. నీవు ఎంత బాగా విషయాలను నేర్చుకుంటే నీ జ్ఞాపకశక్తి అంత చక్కగా వుంటుంది. స్కూల్లో ఏ రోజు చెప్పిన విషయాలను అదే రోజు రెగ్యులర్‌గా చదవు. ప్రతి రోజు ఒకే టైముకి చదవడం, రాయడం ప్రాక్టీసు చెయ్యి. నీవు నేర్చుకునే విషయాల సమాచారం సక్రమంగా వుండాలి. ఆ సమాచారం పట్ల చక్కని అవధానం, ఏకాగ్రత పెట్టాలి. ఇదంతా నీవు చేయదగినపనే కాబట్టి జ్ఞాపకశక్తి అభివృద్ధి పర్చుకోవటం నీ చేతిలోనే ఉంది.

- నీవు చదువుతున్న అంశం నీకు అతి ముఖ్యమైనది. అవసరమైందిగా భావించు - ఏకాగ్రత పెట్టటం ఒక అలవాటుగా మార్చుకో. -మనసుని చెదరగొట్టే అంశాలను తరిమి కొట్టు. - నేను బాగా చదివితే మంచి ర్యాంకు వస్తుంది. మంచి ఉద్యోగం వస్తుంది. సమస్యలు తీరిపోతాయి. అందరి మెప్పు లభిస్తుంది. విదేశాల్లో మంచి జాబ్ దొరుకుతుంది. అని ప్రతి రోజూ పడుకునే ముందు, ఉదయం లేచిన

చందు

వంశీ తీస్తున్న 'మహర్షి' చిత్రానికి తనికెళ్ళ భరణిగారు నన్ను సిఫార్సు చేశారు. దీంతో సినిమారంగంలో ప్రవేశించాను. ఇక్కడ నిలదొక్కుకోవడానికి 15 ఏళ్ళు పట్టింది. ఈ గ్యాప్‌లో 'చెట్టుకింద ప్లీడరు', 'ప్రేమ అండ్ కో', 'జైత్రయాత్ర' వంటి చిత్రాల్లో నటించాను. సినీ ఇండస్ట్రీకి భూమికన్నా ఎక్కువ ఆకర్షణశక్తి ఉంది. ఇక్కడ పేరుతోపాటు డబ్బులూ వస్తాయి.



హాస్య నటుడు కృష్ణభగవాన్ చెప్తోన్న సినిమా కబుర్లు...

# భూమికన్నా ఆకర్షణశక్తి ఎక్కువ

**మా** స్వస్థలం కాకినాడకు 16 కిలోమీటర్ల దూరంలో ఉన్న కైకవోలు. బి.కాం వరకు చదివాను. నాటకాలాడే అలవాటుంది. జీవితంలో ఏదో ఒకటి చేయాలన్న తపనతో 'మిత్రా అండ్ కో' అనే పచారీ సరుకుల కొట్టు పెట్టాను. నాది మొదటి నుంచీ బిజినెస్ మైండ్ కాదు. తిరిగే కాలు ఊరుకోదంటారు కదా! దీంతో కొట్టు గురించి పట్టించుకోలేదు. సంవత్సరం తిరిగే సరికి ఫ్యాన్ ఒక్కటి మిగిలింది. నేను దేనికి పనికొస్తానో ఆలోచించాను. నాటకానుభవం ఉండడంతో సినిమాల్లో ప్రయత్నాలు సాగిద్దామని ఆ ఒక్క ఫ్యానూ అమ్మేసి ఇంట్లో చెప్పకుండా మద్రాస్ పారిపోయాను. క్రాంతికుమార్‌గారు తీస్తున్న 'త్రిశూలం' అనే చిత్రంలో సెలక్ట్ అయ్యాను. కానీ ఆ సినిమా స్టార్ట్ కాలేదు. ఆ సమయంలో వంశీ తీస్తున్న 'మహర్షి' చిత్రానికి తనికెళ్ళ భరణిగారు నన్ను సిఫార్సు చేశారు. దీంతో సినిమారంగంలో ప్రవేశించాను. ఇక్కడ నిలదొక్కుకోవడానికి 15 ఏళ్ళు పట్టింది. ఈ గ్యాప్‌లో 'చెట్టుకింద ప్లీడరు', 'ప్రేమ అండ్ కో', 'జైత్రయాత్ర' వంటి చిత్రాల్లో నటించాను. సినీ ఇండస్ట్రీకి భూమికన్నా ఎక్కువ ఆకర్షణశక్తి ఉంది. ఇక్కడ పేరుతోపాటు డబ్బులూ వస్తాయి. అవకాశాలు రాని సమయంలో నా పరిస్థితి దారుణంగా ఉండాలి. కానీ, షిర్డీ సాయిబాబా, రమణ మహర్షి జీవిత చరిత్రలు, జిడ్డు కృష్ణమూర్తి పుస్తకాలు చదవడం వల్ల ప్రశాంతంగా ఉన్నా. అదీకాక ఇంట్లో అమ్మ, నాన్న, అక్క, మేనల్లుళ్ళు అందరం సరదాగా, ప్రేమగా ఉండడంతో అవకాశాలు రాలేదన్న బాధ తెలీలేదు. జీవిత సత్యాన్ని చెప్పే ఆత్రేయగారి 'అనుకున్నామని జరగవు అన్నీ...' పాట గుర్తు తెచ్చుకుని ధైర్యంగా ఉండేవాణ్ణి. అవకాశాలు రాకపోవడంలో నాలోపం కూడా ఉంది. ఎవరి దగ్గరకన్నా వెళ్ళి వేషాలడగాలంటే ఇబ్బందిగా ఉండేది. తెరపై నటిస్తానుగానీ వెనకాల నటించలేను. ఒక వేళ నటించినా అది నటనని తెలిసిపోతుంది.

### విగ్రహమైపోయాను...

డాన్సర్ అనురాధ ఇంట్లో అద్దెకుండే వాళ్ళం. ఆమె రాత్రి తొమ్మిదింటికల్లా కుక్కలను వదిలేసేది. డాబర్ మాన్, బాక్సర్, జెర్మన్ షెప్పర్డ్ వంటి జాతి కుక్కలుంటాయని అప్పుడే తెలిసింది. బాత్‌రూం బయటుండేది. ఉక్కపోస్తోందని ఓ రాత్రి స్నానం చేసి ఇంట్లోకి వెళ్తున్నా. ఇంకో నాలుగడుగులేస్తే ఇంట్లోకి వెళ్ళిపోతా. కరెక్టుగా అప్పుడే కుక్కలు వచ్చేశాయి. దీంతో విగ్రహంలా నిలిచిపోయా. అలా చాలా సేపు ఉండి లాభం లేదనుకుని స్లోమోషన్‌లో నడుచుకుంటూ ఇంటిలోకి వెళ్ళిపోయే సరికి తెల్లవారు జామున నాలుగున్నర అయింది. రాత్రి పదకొండు నుంచి తెల్లవారు జామున నాలుగున్నర వరకు విగ్రహంలా నుంచొనే సరికి చెమటలు పట్టి మళ్ళీ స్నానం చేయాల్సిన పరిస్థితి వచ్చింది.



### బాధపడ్డా...

ఓ చిత్రంలో ఒక సన్నివేశంలో మందు కొడుతూ పకోడీలు తినాలి. కానీ రిహార్సల్స్‌లోనే తినేశాను. 'వీడికి అన్నం పెడుతున్నారా? లేదా? రిహార్సల్స్‌లోనే తినేస్తున్నాడు' అని దర్శకుడు అందరిలో పట్టుకుని నన్ను అన్నందుకు బాధపడ్డా.

నేను మాట్లాడితే చాలా సెటైరికల్‌గా వుంటుందంటారు. సెటైర్స్‌తో బాధపెట్టడం నా ఉద్దేశం కాదు. 'పదో వాడి బాధ తొమ్మిది మందికి నవ్వు' అని చార్లీ చాప్లిన్ అన్నట్లు అప్పుడప్పుడూ అలా జరుగుతూ ఉంటుంది. అందరితో జోవియల్‌గా ఉండడానికి ప్రయత్నిస్తాను. అష్టావధానం చేసేవాడి బ్రెయిన్ ఆ ఆలోచనల చుట్టూ పరిభ్రమిస్తున్నట్లు సినిమాల్లో సెటైర్స్ వేయడం వల్ల మంచికో చెడుకో దాని ప్రభావం నాపై ఉందనిపిస్తోంది.

### ....ఆ పాత్ర అంటే ఇష్టం

లెక్కపెట్టలేదుగానీ... ఇప్పటివరకూ 150 చిత్రాల్లో నటించివుంటా. 'కబడ్డీ-కబడ్డీ' చిత్రంలోని పాత్రంటే చాలా ఇష్టం. ఎందుకంటే... ఆ క్యారెక్టర్‌లో స్నేహం, సెంటిమెంట్, కామెడీ ఉన్నాయి. 'ఏప్రిల్ ఒకటి విడుదల'లో రాజేంద్రప్రసాద్ పోషించిన పాత్రలా సాగుతుంది. అలాగే 'ఔను వాళ్ళిద్దరూ ఇష్టపడ్డారు', 'వెంకీ', 'ఎవడి గోల వాడిది', 'సాంబ', 'నువ్వంటే నాకిష్టం' చిత్రాల్లోని పాత్రలన్నా ఇష్టమే.

కథా నిలయం
శ్రీకాకుళం

# అటు తిప్పండి

**హా**య్ ఫ్రెండ్స్! ఈ చేపను అగ్గిపుల్లలతో చేశారు. అది ఎడమ చేతివైపుకు చూస్తోందికదా. మూడంటే మూడే అగ్గిపుల్లలను కదిలించి కుడిచేతివైపుకు చూసేట్టు చేయండి చూద్దాం. ఎంతకూ తెలీకపోతే మాత్రం మా సమాధానం చూడండే.






# చుక్కలు కలిపితే పోలా

అదో 'తికో' పిల్ల. ఓసారి అడవిలో తల్లి నుంచి తప్పించుకుంది. అమ్మకోసం వెతుకుతోంది. చివరకు ఎలాగో అమ్మను చూసింది ఆనందంతో కిచ కిచ మంటూ అమ్మను చేరింది. అమ్మ సంతోషంగా ఇచ్చిన అరటి పండు తింది. ఇంతకూ ఈ తికో ఎవరబ్బా... తెలియాలంటే చుక్కలు కలపాలి మరి.

(జవాబు: 'తికో'ను తిరగేసి చదవండి. అదే ఆన్సర్.)



తోట. లీలా భార్గవ్,
9వ తరగతి,
మధు విద్యాలయం,
వైరా.



ఆర్. రాహుల్,
9వ తరగతి,
సెయింట్ ఆన్స్ స్కూల్,
మార్కాపురం.

ఎన్. నవీన్,
6వ తరగతి,
జడ్.పి.ఎస్.ఎస్.,
భట్టు పల్లి,
కాగజ్‌నగర్,
ఆదిలాబాద్.

జి. అశోక్ కుమార్,
9వ తరగతి,
జడ్.పి.హెచ్.ఎస్.,
అజ్జకొల్లు,
మహబూబ్‌నగర్.

## నేస్తాలను చేరేదెలా!

ఈ బొమ్మలో కనిపిస్తున్న మూడు చీమలూ మాంచి నేస్తాలు. ఓసారి అవన్నీ కలిసి పక్‌నిక్‌కి వెళదామనుకుంటాయి. అనుకున్న చోటుకి అనుకున్న సమయానికి రెండు చీమలు మాత్రమే వస్తాయి. మూడోది పిక్‌నిక్‌లో ఆడుకోవడానికి కావాల్సిన వస్తువులను, చదువుకోవడానికి జోక్స్ పుస్తకాలను, తినుబండారాలను తీసుకుని వచ్చేసరికి బాగా ఆలస్యమౌతుంది. ఇంతకీ ఆ మూడో చీమ తతిమ్మా రెంటినీ చేరే దారి ఏదబ్బా...





## ఆరు మొహాలు కనిపించాయా?

ఇదిగో చిన్నారులూ... ఈ చెట్టుబొమ్మలో ఆరుగురి మొహాలున్నాయి. ఇంతకీ అవి ఎక్కడో కనుక్కొని సున్నా చుట్టండి చూద్దాం. ఓ క్లూ కూడా ఇస్తున్నాం. చెట్టుకు బోలెడన్ని కొమ్మలున్నాయికదా. అక్కడ చూడండే.

## ఆ నాలుగు ఎక్కడున్నాయో ఏంటో..

చిన్నారులూ.... మీకు ఇవాళ ఒక కష్టమైన పరీక్ష పెట్టబోతున్నామర్రా... ఇదిగో ఈ బొమ్మ చూశారుగా. బోలెడన్ని గజిబిజి గీతలు...చుక్కలు కనిపిస్తున్నాయి. ఇందులో నాలుగంటే నాలుగు జంతువులు దాక్కున్నాయి. అవేంటంటే... పంది, బాతు, ఎద్దు, మేక. వాటి ఆకారాలను కనిపెట్టి రంగులు వేయాలి. మీకు ఈజీగా తెలియాలంటే... మీ చిట్టి బుర్రకు పదును పెట్టాల్సిందే..

## క్షీరదాలు ఎక్కడ దాక్కున్నాయి?

నేస్తాలూ... పాలిచ్చి పెంచే జంతువులను మమల్స్ (క్షీరదాలు) అంటారని మీకు తెల్సుగా. ఆ అలాంటివి ఇక్కడ వున్నాయి. వాటిని గుర్తించి రంగులు వేయండి చూద్దాం.

ఎం కోటేశ్వరరావు

# బడ్జెట్ అంటే ఆల్జీబ్రానా

బడ్జెట్ అంటేనే చాలా మందికి ఒక చిదంబర రహస్యం. లాలూ ప్రసాద్ యాదవ్ మంగళవారం నాడు రైల్వే బడ్జెట్‌ను, కేంద్ర ఆర్థికమంత్రి పి చిదంబరం శుక్రవారం నాడు సాధారణ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు.. చిదంబరం ప్రవేశ పెట్టారని కాదుగాని నిజానికి బడ్జెట్ ఒక పట్టాన సామాన్యులకు అర్థం కాదు. ఆల్జీబ్రా వంటిది. చిదంబర రహస్యం లాంటిది. అయినా సరే అర్థం చేసుకోవటానికి ప్రయత్నించక తప్పదు. అసలింతకీ బడ్జెట్ అంటే ఏమిటి? ఈ మాత్రం మాకు తెలియదా అని అనుకోకండి.

'ఓరి పిచ్చినాగన్నా! బడ్జెట్ అంటే జమా ఖర్చులను ఒక దగ్గర రాసుకోవటంరా' అని మా అమ్మమ్మ నా చిన్నపుడే నాకు జ్ఞానోదయం కలిగించింది. 'అయితే అమ్మమ్మా! బడ్జెట్ ప్రవేశపెట్టే వారి చేతిలో ఒక ఎర్రరంగు తోలు కవర్ ఉన్న బ్రీఫ్‌కేస్ ఉంటుందే అది ఎందుకు?' అని అడిగితే 'నాకు తెలుసుగానీ పనిలో ఉన్నా.... వెళ్లి మీ నాయనమ్మనడుగు' అని ఆ రోజుల్లోనే తెలుగు టీవీ సీరియల్ విలనీ ఫోజుతో నన్నటు తోలింది. నా సందేహం తీరలేదు.

తరువాత బుద్ధుడి కథ చదివినపుడు తెలియని వాటిని తెలుసుకోవటానికి అమ్మమ్మ, నాన్నమ్మలను అడగటం కంటే బోధి వృక్షం బెటరని మాఊరి బయటి రావిచెట్టు కిందికి వెళ్లే వాడ్ని. లాభం లే. ప్రియమైన పాఠకులారా మీకు ఆ శ్రమ అక్కర లేదు. కాస్తంత కిందికి తొంగి చూడండి.

**బడ్జెట్ అంటే ఏంటబ్బా...**

బడ్జెట్ అంటే జమా ఖర్చులే. అయితే మరి మిగులు సంగతేమిటి? మిగులు లేకపోతే అవసరాలకు కొత్తగా డబ్బు సమకూర్చుకోవటం ఎట్లా? సమకూర్చుకున్న డబ్బును అందరికీ ఎవరి వాటా వారికి న్యాయంగా పంచటం ఎలా? అవసరం అయిన వారికి ఎక్కువ ఇచ్చి లేని వారికి తక్కువ ఇస్తే మిగతా వారు ఊరుకుంటారా? అబ్బో ఎన్ని ప్రశ్నలో? అందుకే బడ్జెట్ అంటే ముందే చెప్పుకున్నాం ఆల్జీబ్రా అని. ఆల్జీబ్రా అంటే గతంలో గుండె గాభరా అని కొందరికి భయం. కానీ ఇప్పటి పిల్లలు ఆల్జీబ్రాలోనే పుట్టి ఆల్జీబ్రాలోనే పెరుగుతున్నారు కనుక వారికి అలాంటి భయాలేమీ ఉండవు. కనుక మీరు భయపడనవసరం లేదు. ఎందుకంటే నేనిక్కడ ఎలాంటి బడ్జెట్‌ను ప్రతిపాదించటం లేదు.

**తొలి బడ్జెట్ ప్రవేశపెట్టింది అమ్మే!**

'ఇంత ఉపోద్ఘాతం ఎందుకు బాబూ అసలు బడ్జెట్ గురించి సూటిగా చెప్పరాదూ' అనుకుంటున్నారు కదూ. ఆ పాయింటుకే

## ఇదివరలో సాయంత్రం ప్రవేశపెట్టేవారెందుకు?

మన స్వాతంత్ర్యానికి ముందు ప్రభుత్వాలు సాయంత్రం ఐదుగంటల సమయంలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టేవి. ఎందుకంటే ఆ సమయానికి బ్రిటన్‌లో తెల్లవారు తుంది కనుక. ఆ సాంప్రదాయాన్ని మనదేశంలో కేంద్ర ప్రభుత్వం దాదాపు 50ఏళ్లపాటు పాటించింది. అయితే 1999లో తొలిసారిగా బడ్జెట్‌ను ఉదయం 11గంటలకు ప్రవేశపెట్టారు. అసలు మన బడ్జెట్ సంవత్సరాన్ని ఏప్రిల్ ఒకటి మార్చి 31కి బదులు అక్టోబర్ ఒకటి సెప్టెంబరు 30కి మార్చాలని పాలనా సంస్కరణల కమిటీ 1967లోనే సిఫార్సు చేసింది. ఎందుకంటే మన దేశంలోని వాతావరణ పరిస్థితుల కారణంగా అక్టోబర్ సమయానికి ప్రధాన వర్షరుతువు ముగుస్తుంది. పంటలపై ఒక స్పష్టమైన అంచనా వేయటానికి, తద్వారా బడ్జెట్‌ను మరింత సాధికారికంగా రూపొందించవచ్చని కమిటీ చెప్పింది. అయితే దీన్ని మన ప్రభుత్వాలు ఇంతవరకు పట్టించుకోలేదు. అందువలన అనేక సందర్భాల్లో వ్యవసాయంపై బడ్జెట్‌లో వేసిన అంచనాలు తలకిందులౌతున్నాయి. రైతులను ఆదుకోనేందుకు ఇది కూడా ఒక ప్రధాన ఆటంకంగా తయారౌతోంది.

వస్తున్నా. ఇంతకీ తొలి బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి ఎవరో తెలుసా? మనలను కన్న మనకు తెలియని పురాతన అమ్మ. మానవ సమాజంలో ఒక దశలో ఆడామగా, పెద్దలూ, పిల్లలూ సామూహికంగా వేటాడి తెచ్చిన మాంసం, దుంపలు, కాయలు పండ్లను అందరూ కలిసి తినేవారు. తరువాత దశలో మగవారు మాత్రమే వేటకు పరిమితమైనపుడు సమాజానికి ఆర్థిక మంత్రి అవసరం వచ్చింది. ఆ పాత్రను ఆడవారు తీసుకున్నారు. మగవాళ్లు వేటనుంచి తెచ్చిన వాటిని అందరికీ సమంగా పంచటం ఆడవారి వంతైంది. అది ఇప్పటికీ కొనసాగుతోంది కదా! వేట సంపదలను పంచటమే కాదు, చేయగలిగిన వాటిని నిలవ చేయటంలోనూ, వేటలేనపుడు, ప్రకృతి ప్రళయాలు వచ్చినపుడు వాటిని అందరికీ అందచేయటంలోనూ ఆడవారిదే ప్రముఖ పాత్ర. అందుకే తరువాత కుటుంబంపై ఆడవారికి పట్టుకూడా వచ్చింది. పురాతన బడ్జెట్‌కు ఇదే ప్రాతిపదిక. తరువాత కాలంలో వ్యవసాయం, పశుపోషణ, వస్తుమార్పిడి పద్ధతి ఉనికిలోకి వచ్చిన తరువాత బడ్జెట్ మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. నాటి వస్తుమార్పిడి స్థానాన్ని ఇప్పుడు కాగితపు, ప్లాస్టిక్ కరెన్సీ ఆక్రమించింది. అమ్మను బయటికి నెట్టి నాన్న పెత్తనం చేయటం ప్రారంభించాడు (అదేనండీ పురుషాధిక్యత).

### బడ్జెట్‌కూ బ్రీఫ్‌కేస్‌కూ లింకేంటో...!

'ఇంతకూ బడ్జెట్ ప్రవేశపెట్టేవారు బ్రీఫ్ కేస్ ఎందుకు పట్టుకుంటారో చెప్పలేదు...' అని అటువైపు నుంచి కొంటె కోణంగి ఎవరో సణుగుతున్నారు. అన్నీ ఒకసారే చెప్పేస్తే మజా ఏముంటుంది. థామస్ కొరయేట్ అనే ఆంగ్ల యాత్రీకుడు 1612లో బ్రిటన్ నుంచి బయలుదేరి గ్రీస్, మధ్యధరా సముద్రం, పర్షియా మీదగా భారత్ వచ్చాడు. ఎక్కువ భాగం కాలినడకనే ప్రయాణం చేశాడు. ఆగ్రా, సూరత్ తదితర ప్రాంతాలను సందర్శించాడు. 1617లో సూరత్‌లో దయేరియా వ్యాధితో మరణించాడు. ఆ కాలంలో యాత్రీకులు ప్రధానంగా కాలినడకనే ప్రయాణం సాగించేవారు. అందువలన అత్యవసరమైన... తక్కువ సామాన్లతో ప్రయాణించటం అలవాటైంది. చిన్న చిన్న వస్తువులన్నింటినీ కలిపి మోసుకుపోయే తోలు సంచిని బడ్జెట్ అని 1611లో కొరయేట్ తన రచనలో వర్ణించారు. స్పానిష్ భాషలో అలాంటి సంచిని 'లాటిన్ బుల్గా' అనే వారు. ఐర్లండ్‌లో 'బాగ్' అనే వారు. ఫ్రెంచి భాషలో 'బౌ జెట్' అనే వారు. ఆ శతాబ్ది చివరికి అది ఒక మనిషికి అవసరమైన వస్తువులన్నింటినీ తీసుకుపోయే 'బడ్జెట్'గా పేరు పొందింది. రచయితలు ఆ పదాన్ని నాటకాలు, కథలు, నవలల్లో అనేక అర్థాలతో ఉపయోగించారు. చివరకు ఒక పత్రికకు 'పాల్‌మాల్ బడ్జెట్' అని పేరు పెట్టారు. అంటే వార్తల పొత్తి అని అర్థం. అమెరికా నాయకుడు థామస్ జఫర్సన్ 1785లో ఒక లేఖలో 'మిస్టర్ షార్ట్ నుంచి లండన్ పేపర్ల (బడ్జెట్) సంచి అందింది' అని రాశారు.

మరి విత్త విషయాలకు సంబంధించి బడ్జెట్ అనే పదం ఎలా వచ్చింది? బడ్జెట్ అంటే సంచి అనుకున్నాం కదా! బ్రిటన్‌లో 1733లో ఒక ఆకాశరామన్న కరపత్రం వెలువడింది. దానికి పెట్టిన పేరు 'ది బడ్జెట్ ఓపెన్డ్'. నాటి బ్రిటీష్ విత్తమంత్రి చేయదలచిన ప్రతిపాదనలు ముందుగానే బయట పడటంతో వాటిని ఉతికి ఆరేస్తూ కొందరు ఒక కరపత్రం ద్వారా ఎండగట్టారు. అంటే అప్పటికే మంత్రులు తమ ద్రవ్య, ఆర్థిక ప్రతిపాదనల కాగితాలను తోలు సంచుల్లో తీసుకువస్తున్నందున దానికి వ్యంగ్యంగా పెట్టిన పేరు బడ్జెట్. అయితే అదే చివరికి 1760 దశకంలో బ్రిటన్ ఆర్థిక మంత్రులకు అధికారిక పదంగా మారిపోయింది. ఆ తరువాత 1880 దశకంలో మరింత స్పష్టంగా జమాఖర్చుల ప్రణాళిక వేయటానికి బడ్జెట్ అనే మాట క్రియా పదంగా మారింది. అన్నింటికంటే విచిత్రం ఏమంటే దాని అర్థాన్ని 1958లో మాత్రమే స్థిరపరిచిన పదంగా నమోదు చేశారు.

### మొదట్లో ఏప్రిల్‌లో...

బ్రిటన్‌లో బడ్జెట్లను ప్రతిఏడాది ఏప్రిల్ నెలలో ప్రవేశపెట్టేవారు. తరువాత మార్చినెల 31కి మార్చారు. మన దేశం బ్రిటీష్ వారి ఆధీనంలో ఉన్న సమయంలో భారత్‌కు సంబంధించిన బడ్జెట్‌ను బ్రిటీష్ పార్లమెంట్‌లో డిసెంబరు 31న సమర్పించి తరువాత జరిగే సమావేశాల్లో చర్చించేవారు.

### ఒక్కోదేశం ఒక్కో తేదీ ఎంచుకుంది

ప్రపంచంలో అన్ని దేశాలూ బడ్జెట్లను ఒకే తేదీన ప్రవేశపెట్టటం లేదు. ఒకే విధానాన్నీ అనుసరించటం లేదు. అయితే ఏడాదికి ఒకసారి ప్రవేశపెట్టాలని నిర్ణయించాయి. రష్యాలో వార్షిక బడ్జెట్లను 1866 నుంచి ప్రారంభించారు. ఈజిప్టు, టర్కీ దేశాలు రాజశాసనం ద్వారా 1875లో బడ్జెట్ ప్రచురణకు ఆదేశించాయి. బ్రిటన్, జర్మనీ, డచ్, భారత దేశాల ఆర్థిక సంవత్సరాలు ఏప్రిల్ ఒకటి నుంచి ప్రారంభమౌతున్నాయి. ఫ్రాన్స్, బెల్జియం, ఆస్ట్రియాలో జనవరి ఒకటవ తేదీన, అమెరికా సంయుక్తరాష్ట్రాలు, ఇటలీ, స్పెయిన్, కెనడాలో జూలై ఒకటిన ప్రారంభమౌతాయి. బ్రిటన్ ఆర్థిక సంవత్సరం 1833కు ముందు జనవరి ఒకటిన ప్రారంభమయ్యేది.

బ్రిటన్‌లో 1852లో, 1860లో బడ్జెట్లను సకాలంలో ప్రవేశపెట్టలేదు. తొలిసారి ఆర్థిక మంత్రి ఓడిపోవటం కారణమైతే, రెండవసారి ఫ్రాన్స్‌తో చేసుకున్న వాణిజ్య ఒప్పందం కారణంగా 1860లో ఫిబ్రవరి పదిన ప్రవేశపెట్టారు. అంతకు ముందు 1859లో అధికార మార్పిడి కారణంగా జూలై 18వరకు ప్రవేశపెట్టలేదు, 1880లో కూడా అధికార మార్పిడి కారణంగా మార్చినెలలో ఒకసారి జూన్‌లో మరోసారి బడ్జెట్లను ప్రవేశపెట్టారు. బ్రిటన్‌లో మంత్రివర్గ పరిశీలన తరువాత బడ్జెట్‌ను కార్యనిర్వాహకవర్గం పార్లమెంట్‌లో ప్రవేశపెడుతుంది. అమెరికాలో అందుకు పూర్తి విరుద్ధంగా పార్లమెంటే బడ్జెట్‌ను నిర్ణయిస్తుంది. కార్యనిర్వాహక వర్గానికి పాత్ర ఉండదు. విత్తమంత్రి ప్రజాప్రతినిధుల సభలో బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. ఒకే దేశంలో పలు రాష్ట్రాలు ఉన్నపుడు ఆయా రాష్ట్రాలు తమ పరిధిలో బడ్జెట్‌లను ప్రవేశపెడతాయి. అయితే వాటికి కేంద్రం అనుమతి ఉండాలి. అలాంటి విధానం

మనదేశంతో పాటు అమెరికా, జర్మనీ, అర్జెంటీనా తదితర దేశాల్లో ఉంది. బడ్జెట్‌కు ముందు రోజు ఆర్థిక మంత్రులు బడ్జెట్ పత్రాలను చదువుతున్నట్లు, దానిపై సంతకాలు పెడుతున్నట్లు, తుదిమెరుగులు దిద్దుతున్నట్లు మీడియాలో ఫొటోలు వస్తాయి కదా! అది బ్రిటీష్ సంప్రదాయం, దాన్నే మనం కూడా పుచ్చుకున్నాం.

**సాధారణ బడ్జెట్**

సాధారణ బడ్జెట్‌ను ఫిబ్రవరి నెలలో చివరి పని రోజున ప్రవేశపెట్టాలన్నది మన రాజ్యాంగ నిబంధన. నిబంధనల ప్రకారం ఆరోజు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేది 'వార్షిక ద్రవ్య ప్రకటన' (యాన్యువల్ ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్) మాత్రమే. ఒకసారి ప్రవేశపెట్టిన తరువాత దానిని బడ్జెట్‌గా వ్యవహరిస్తారు. బడ్జెట్ ప్రవేశపెట్టిన రోజున సభలో ఎటువంటి ఇతర కార్యక్రమాలను చేపట్టకుండా వాయిదా వేస్తారు. బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన 75 రోజులలోపు దానిని ఆమోదించాలి. ఈ లోగా మార్చినెల 31 పూర్తి అవుతుంది కనుక ఆమోదం పొందేవరకు ఆయాశాఖలకు అవసరమైన ఖర్చుల నిమిత్తం నిధుల విడుదలకు పార్లమెంట్ ఆమోదం తెలుపుతుంది. రాష్ట్ర శాసనసభలకైనా ఇదే విధానం. అయితే మన రాష్ట్రంలో మార్చి 31 నాటికి బడ్జెట్ ఆమోదం పొందేవిధంగా ముందుగానే తేదీలను నిర్ణయించి సభను సమావేశపరచటం ఆనవాయితీగా వస్తోంది. ఇంతకీ బడ్జెట్‌ను గతంలో సాయంత్రం ఐదు గంటలకు ఎందుకు ప్రవేశపెట్టేవారు?

**బడ్జెట్ అంటే భయపడేదెవరు!**

ప్రభుత్వాలు పన్నులేమి వడ్డిస్తాయోనని బడ్జెట్ అంటే గతంలో జనం భయపడేవారు. ఇప్పుడు అలాంటిదేమీ లేదు. ఎందుకంటే వడ్డించాల్సినవన్నీ బడ్జెట్‌తో నిమిత్తం లేకుండానే ముందుగానే నిర్ణయించి అమలు జరిపేస్తున్నారు. ఈ బడ్జెట్‌కు ముందే కేంద్రం పెట్రోలు, డీజిల్ ధరలను పెంచింది కనుక వేరే ఉదాహరణలు చెప్పనవసరం లేదు. అయితే బడ్జెట్‌కోసం ఎవరు ఎదురు చూస్తున్నారు? ఆదాయపన్ను పరిమితి పెంపు, రాయితీల కోసం వేతన జీవులు, పన్నురాయితీల కోసం పారిశ్రామికవేత్తలు మాత్రమే ఎదురు చూస్తున్నారు. అందువలన మన బడ్జెట్ ఇప్పుడు రాష్ట్రాల బడ్జెట్ల మాదిరి ఒక సాదాసీదా వ్యవహారంగా మారిపోయింది. భారాలు, పన్నులు లేని బడ్జెట్లుగా పాలకపార్టీలు డబ్బా వాయించుకొనేందుకు ఉపయోగపడే ఒక సందర్భంగా తయారైంది. ఇంతకీ మనకు ఎలాంటి బడ్జెట్ కావాలి? సమాజ సంపదలను అందరికీ సమంగా పంచేదే సరైన బడ్జెట్. మన బడ్జెట్, దానిని రూపొందించే విధానాల పర్యవసానం ఎలా ఉంది. స్వాతంత్ర్యం నాటికి బడా పెట్టుబడిదార్లుగా ఉన్న టాటా, బిర్లాల మధ్యలో వచ్చిన అంబానీలు లక్షల కోట్లకు అధిపతులై వారిని వెనక్కు నెట్టారు. మరోవైపు రోజుకు రెండుపూటలా తిండికి కూడా కరువైన వారు కోట్లమంది జనం మన కళ్లముందున్నారు. అంటే మన బడ్జెట్‌లు ధనికులను మరింత ధనికులుగా పేదలను మరింత పేదలుగా మార్చివేస్తున్నాయని వేరే చెప్పాలా? ధనికులపై నిజంగా ఆదాయపన్ను వసూలు చేస్తే ఎవరిదగ్గరైనా ఆస్తులు ఎలా పెరిగిపోతాయి? వసూలు చేసిన పన్నులు, ఆదాయపన్ను దారిద్ర్యనిర్మూలనకు వినియోగిస్తే మరి ఏటేటా దారిద్ర్యం, దరిద్రులు ఎందుకు పెరుగుతున్నట్లు? ముందే చెప్పుకున్నాం కదా ఇదే అసలైన ఆల్జీబ్రా. తెలుసుకోవటం, మనకు అనుకూలంగా మార్చుకోవటం, అందుకు మామూలుగా అంగీకరించకపోతే పెద్దలు చెప్పారుగా! సామ, బేధ, దాన, దండోపాయాల గురించి. వాటిని అమలులో పెట్టటమే.

✲

---

## బడ్జెట్-జోక్స్

**ఎవరు గొప్ప ?**

ఒక క్లబ్బులో ఒక డాక్టర్, ఆర్కిటెక్ట్, ఒక ఆర్థికవేత్త ఒక టేబుల్ మీద కూర్చున్నారు. తమ గొప్పలు చెప్పుకోవటం ప్రారంభించారు. 'అసలు వైద్యుడంటే దేవుడి కిందే లెక్క. ఆదాము పక్కటెముక నుంచి ఒక ఎముకను తొలగించి అవ్వను సృష్టించింది దేవుడే కదా' అన్నాడు వైద్యుడు. వెంటనే ఆర్కిటెక్ట్ 'అలా అంటే నేను ఒప్పుకోను. దేవుడు సృష్టి కర్త. అస్తవ్యస్థ పరిస్థితుల నుంచి ఏడు రోజుల్లో ఈ ప్రపంచాన్ని సృష్టించాడు తెలుసా?' అని తాను అపర సృష్టికర్తను అన్నట్లు ఫోజు పెట్టాడు. ఆర్థిక వేత్త ముసిముసిగా నవ్వుతూ 'మరి అస్తవ్యస్థ పరిస్థితులను ఎవరు సృష్టించారో చెప్పగలరా!' అనడిగాడట.

**కోత**

అమెరికా బడ్జెట్ గురించి అక్కడి పత్రికల్లో వచ్చిన ఒక జోకు ఇది.

'మన అధ్యక్షుడు బడ్జెట్‌లో అనేక కోతలను ప్రకటించాడు. వాటిలో విద్య ఒకటి. ఇది ఎంతో తెలివైన చర్య. పిల్లలు పెరిగి డిగ్రీ చదివేనాటికి వారికి ఎంత అప్పుందో కూడా తెలుసుకోలేని విధంగా గణితంలో వెనుకబడి ఉంటారు.'

**పొదుపు**

ఒక ఇల్లాలు ఇంటి బడ్జెట్‌లో పొదుపు చర్యలు చేపట్టాలని నిర్ణయించింది. దానిలో భాగంగా పని మనిషిని మాన్పించింది. ఒక రోజు భర్త ముందు పిల్లలతో ఇలా అంది. 'చూశారా పిల్లలూ! ఈ రోజు నేను బట్టలు ఉతికి పదిరూపాయలు వెనకేశాను'. వెంటనే భర్త 'అరేయ్ మీ అమ్మను వాటిని మరోసారి ఉతకమనండ్రా మరో పదిరూపాయలు వస్తాయి' అన్నాడు పిల్లలతో.

**పరిష్కారం**

ఆర్థికవేత్తలకు ఒక సమస్యను పరిష్కరించమని అప్పగిస్తే అది ఎంతకూ ఒక కొలిక్కిరాదట? ఎందుకంటే ఎవరి దృక్పథం వారిది. ఎదుటి వారి దానిని మిగతా వారు అంగీకరించరట? ఒక సమావేశంలో ఒక విద్యుత్ బల్బు మార్పిడి సమస్యను ఆర్థికవేత్తల ముందుంచారట.

మితవాద ఆర్థికవేత్తలూ మీరైతే ఏం చేస్తారని ప్రశ్నించగా వారి ప్రతినిధి లేచి 'అసలు ప్రభుత్వం బల్బు మార్పిడి గురించి మర్చిపోతే మంచిది. సమస్య దానంతట అదే సెట్ అవుతుంది' అన్నాడు. తరువాత ప్రధాన స్రవంతిలోని వారి వంతు వచ్చింది. వారిలో ఇద్దరు లేచారు. ఒకరు బల్బ్ మార్చేందుకు ప్రయత్నిస్తే మరొకరు నిచ్చెన ఎక్కడుందని వెతికాడట. తరువాత 'చికాగో స్కూలు (అమెరికన్ తరహా) ఆర్థికవేత్తలు ఎవరైనా ముందుకు వస్తారా' అని అడిగారట. ఒక్కరూ రాలేదు. ఒకరు లేచి మార్కెట్లో మార్పులకు బల్బు మార్పిడి అవసరం అయితే ఈపాటికే మారిపోయి ఉంటుంది అన్నారు. తరువాత ఉదారవాదులైన వారి వంతు వచ్చింది. ఒక్కరు చేయగలిగిన ఆ పనికి వెంటనే డజను మంది లేచారు. ప్రతివారికీ అవకాశం ఇవ్వాలని కోరారు. తరువాత ఎకనమిక్స్ చదివే విద్యార్థుల వంతు వచ్చింది. ఎంతమంది ఈ పని చేయగలరని అడిగారు. ఒకమ్మాయి లేచింది. తాను బల్బుల వలన కలిగే లాభనష్టాల గురించి పరిశోధన చేస్తున్నానని అది పూర్తి అయిన తరువాత అంటే ఐదు సంవత్సరాల తరువాత ఏ విషయం చెబుతానని అన్నదట. చివరికి కంప్యూటర్ ఎకనమిక్స్ విద్యార్థుల వంతు వచ్చింది. ముగ్గురు లేచారు. ఒకరు బల్బు బొమ్మను తీసుకున్నారు. మరొకరు దానిమీద ప్రోగ్రామ్ రాయటం ప్రారంభించారు. మూడోవాడు మౌస్‌తో క్లిక్ చేయటం ప్రారంభించాడట.

✲

డాక్టర్ శంకర్,
దంత వైద్యనిపుణులు, హైదరాబాద్., ఫోన్ : 9441333906

కథా నిలయం శ్రీకాకుళం



# నోటి ఆరోగ్యమూ ముఖ్యమే



**మనం ఏం తీసుకున్నా నోటి ద్వారానే తీసుకుంటాం. కాబట్టి నోటి ఆరోగ్యం ముఖ్యం. కొంతమంది నోటి ఆరోగ్యం కన్నా ఒంటి ఆరోగ్యానికే ప్రాధాన్యతినిస్తారు. వ్యాధి ముదిరాక బాధపడతారు. నోరు అనారోగ్యంగా ఉంటే ఆహారంతోపాటు ఆ క్రిములు లోపలికి వెళ్లే ప్రమాదముంది. జీవనశైలి మారడం, బిజీ లైఫ్, ఆహారపు అలవాట్ల వల్ల ఆరు నెలలకోసారి దంత వైద్యుణ్ణి సంప్రదించడం అనివాయితీగా మారింది. నోటి ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలి. బ్రష్ చేయడం, ఫ్లాసింగ్ చేయడం వల్ల నోటి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.**

చిగుళ్ల వ్యాధి ఎక్కువగా ఉండే వారిలో గుండెకు సంబంధించిన సమస్యలు ఎక్కువగా వస్తాయని అనేక పరిశోధనల్లో వెల్లడైంది. మనం తీసుకున్న ఆహారం వల్ల నోట్లోని బ్యాక్టీరియా వల్ల గుండె జబ్బులొస్తాయని ఎన్నో పరిశోధనలు వెల్లడించాయి. ఈ బ్యాక్టీరియాలు రక్తంలోకి ప్రవేశించి కొవ్వు ఫలకాలకు అతుక్కుంటాయి. వీటిని గడ్డలా మార్చేందుకు సహకరిస్తాయి. ఫలితంగా గుండె జబ్బులొస్తాయి.

బ్రష్ చేసుకున్నప్పుడు చిగుళ్ల వెంట రక్తం కారుతుంది. చిగురు కింద ఎముక ఆధారంతో పన్ను ఉంటుంది. చాలా మందికి ఒక వయసు వచ్చిన తరువాత చిగురుకు, ఎముకకు మధ్య ఉండే సందులు పెరుగుతాయి. ఏం తిన్నా చిగుళ్ల కింద ఇరుక్కుపోతాయి. నొప్పి ఉండదు. చాలా మంది నొప్పిలేదని, ఇది సమస్యే కాదని నిర్లక్ష్యం చేస్తుంటారు. చిగుళ్ల వ్యాధిలో నొప్పి లేకుండానే సందులు పెరిగి పళ్లు ఊడిపోతాయి. చిగుళ్ల వ్యాధి ఉన్న వాళ్లు విధిగా పళ్లకు సంబంధించిన చికిత్స చేయించుకోవాలి. ప్రతి ఆరు నెలలకోసారి స్కేలింగ్ చేయించుకోవాలి. రోజూ ఉదయం, రాత్రి బ్రష్ చేసుకోవాలి.

ముఖం మీద మడతలు రావడం, జుట్టు తెల్లబడడం, పళ్లు ఊడడం లాంటి లక్షణాలు వార్ధక్యం సంకేతాలు. వయసు మీద పడుతున్నప్పుడు పళ్లు ఊడిపోవాలనేం లేదు. శరీరంలోని ఇతర అవయవాలు మరణించేంత వరకూ ఎలా తోడ్పడతాయో, పళ్లు అంత వరకు తోడ్పడతాయి. కాకపోతే అందుకు అవసరమైన శ్రద్ధ తీసుకోవాలి. నోటి ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకుంటే పళ్లు చివరి వరకు సేవల్ని అందిస్తాయి. మనం పెరిగేకొద్దీ అతుక్కునే, రంగులేని సూక్ష్మజీవులుండే పాచి పొర పళ్లమీద ఎక్కువగా ఏర్పడుతుంది. ఎనామిల్ కింద ఉన్న డెంటిన్‌లో కూడా మార్పులు వస్తుంటాయి. అలాగే ఏం తిన్నా పుక్కిలించి ఉమ్మేయడం చాలా అవసరం. నిద్ర లేవగానే, పడుకునే ముందు కూడా పళ్లని శుభ్రంగా తోముకోవాలి. ఇలాంటి జాగ్రత్తలు తీసుకుని వయసు మళ్లినా పళ్లని జాగ్రత్తగా ఉంచుకోవాలి. ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే డాక్టర్‌ను కలవాలి.

గర్భిణీ స్త్రీలు దంత సమస్యలతో బాధపడుతుంటారు. గర్భం దాల్చిన ప్రతి ఒక్కరూ దంత సమస్యలతో బాధపడక తప్పదని అనుకుంటారు. కాని ఇది కేవలం అపోహ మాత్రమే. గర్భిణీ స్త్రీలలో కొంత మంది దంత సంబంధిత సమస్యలతో బాధపడి ఉండొచ్చు. అంతమాత్రాన అందరికి ఈ సమస్యలు ఎదురవుతాయని చెప్పలేం. అసలు అధిక శాతం మంది గర్భధారణ సమయంలో ఎందుకిలా దంత సంబంధిత సమస్యలతో బాధపడ్తుంటారు. ఈ విషయం గురించి జరిగిన అధ్యయనంలో పలు విశేషాలు వెల్లడయ్యాయి. గర్భిణీ స్త్రీల ఆరోగ్య పరిస్థితులు, వారిపట్ల శ్రద్ధ తగ్గడం, తీసుకునే ఆహారం వల్ల గర్భిణులు దంత సమస్యలతో బాధపడుతున్నారని తెలిసింది. నెల తప్పిన నాటి నుంచి గర్భిణులు వేవిళ్లు, ఇతరత్రా సమస్యలతో బాధపడే అవకాశం ఉంది. అలాగే పుట్టబోయే బిడ్డకు సంబంధించి ఏర్పాట్లు చేయడంలో సమయం గడచిపోతుంది. తన గురించి తాను ఆలోచించుకునేందుకు తన పట్ల తాను శ్రద్ధ తీసుకునేందుకు వీలు కాదు. ఈ సమయంలో స్వీట్లు, కార్బోహైడ్రేట్లు లభించే ఆహార పదార్థాలు అధికంగా తీసుకోవడం వల్ల కూడా దంత సమస్యలు ఏర్పడవచ్చు.

### బ్రష్ ఎప్పుడు మార్చాలి?

❖ బ్రష్ ఎప్పుడూ మృదువుగా, మెత్తగా ఉండాలి. ❖ ప్రతి మూడు నెలలకోసారి బ్రష్ మారుస్తుండాలి. ❖ బ్రష్ హ్యాండిల్ మరీ పొడవుగా గానీ, పొట్టిగా గానీ ఉండకూడదు. మధ్యస్థంగా ఉండాలి. ❖ పళ్ల అమరికను బట్టి సరైన బ్రష్‌ను డాక్టర్ సలహా ప్రకారం వాడాలి.

### సరైన బ్రష్ ఏది?

మీరు బ్రష్ చేసుకున్నాక చల్లటి నీరు గానీ, ఐస్‌క్రీమ్ గానీ తినగలుగుతున్నరా? లేక పళ్లు జివ్వుమనడం, పంటి నొప్పిగా అనిపించడం జరుగుతోందా? బ్రష్ చేసుకుంటున్నప్పుడు చిగుళ్ల నుండి రక్తం కారుతోందా? ఈ రెండు ప్రశ్నల్లో ఏదైనా సమాధానం అవును అయితే వెంటనే బ్రష్ మార్చండి.

### బ్రష్ చేసుకోవడంలో టెక్నిక్స్

❖ బ్రష్‌ని నోట్లో ఒక పక్కగా పోనిచ్చి గుండ్రంగా బ్రష్ చేయాలి. అంటే పై దంతాల్ని చిగుళ్లపై నుంచి కిందికి, కింది దంతాల్ని చిగుళ్ల కింద నుంచి పైకి బ్రష్ చేసుకోవాలి. పళ్ల బయట శుభ్రం చేసినట్లే పళ్ల వెనుక భాగం, నమిలే భాగం కూడా బ్రష్‌తో శుభ్రం చేయాలి. ❖ మొదట బ్రష్‌ను 45 డిగ్రీల కోణంలో పట్టుకుని పంటి ఉపరితలం భాగానికి బ్రష్‌ను సమాంతరంగా ఉంచాలి. మొదట ముందు పళ్లను తోమాలి. ఎలా పడితే అలా, ఎడాపెడా పళ్లు తోమెయ్యకూడదు. పై పళ్ల మీద పై నుంచి కిందకు, కింద పళ్ల మీద అయితే కింది నుంచి పైకి పళ్లు తోముకోవాలి. పళ్లు తోముకునేటప్పుడు మరీ ఎక్కువ ఒత్తిడి ఉండకూడదు. సున్నితంగా బ్రష్ చేసుకోవాలి. ❖ టూత్‌పేస్ట్‌ని బ్రష్ కుచ్చుల్లోకి చొచ్చుకు పోయేలా వేసుకోవాలి. పళ్లని బ్రష్ చేసుకున్న తర్వాత నోట్లో నీళ్లు పోసుకుని పుక్కిలించాలి. నాలుకను శుభ్రపరుచుకోవాలి .❖ పళ్ల మధ్య ఇరుక్కున్న పదార్థాల్ని తొలగించడానికి "ఫ్లాసింగ్" అనే పద్ధతి ఎంతగానో తోడ్పడుతుంది. "డెంటల్ ఫ్లాస్"ని పళ్ల మధ్యకి పోనిచ్చి రెండు పక్కలా దారాన్ని పట్టుకుని అటూ ఇటూ కదిలిస్తే పళ్ల మధ్య ఇరుకున్న పదార్థాలు బయటికి వచ్చేస్తాయి. ఇలా ఫ్లాసింగ్ చేసేటప్పుడు చిగుళ్లు దెబ్బతినకుండా చూసుకోవడం అవసరం. పిన్నులు, సూదులు, అగ్గిపుల్లలతో పళ్ల మధ్య ఇరుకున్న పదార్థాలను తీయడం మంచి అలవాట్లు కాదు. అలా చేయడం వల్ల పళ్ల మధ్య సందులు ఏర్పడతాయి. దాంట్లో ఆహార పదార్థాల ముక్కలు ఇరుక్కుని దంత వ్యాధులు రావొచ్చు. ❋

కథ

# లోపలి వర్షం



మళయాళీ మూలం : **సారా జోసెఫ్**

తెలుగు : **డాక్టర్ దేవరాజు మహారాజు**

**అయినా నేనెందుకేడుస్తున్నాను? ఎందుకు? ఆమె తనని తాను ప్రశ్నించుకుంది. తనలో ఏదో తెలియని వ్యధ. వెలితి. ఒంటరితనం? ఉన్న ఫళాన సపోటా చెట్టు కొమ్మ నుంచి ఒక చిన్న పక్షిగూడు రాలిపడింది చెట్టు మొదట్లో. సుళ్ళు తిరుగుతున్న నీటిలో అది గిరగిరా తిరిగి కొట్టుకు పోయింది. పక్షిపిల్ల చచ్చిపోతుందేమోనని ఆమె వెంటనే తలుపు తెరచి ఇంటి ముందు ఖాళీ స్థలంలోకి పరుగెత్తింది. నీటిలో కొట్టుకుపోయే గూటిని వెతికి పట్టుకుంది. మురికి నీళ్ళన్నీ ఆమె కాళ్ళ మీద పడ్డాయి. పక్షి పిల్ల నీళ్ళలో తడిచి, వణుకుతోంది. దానికింకా రెక్కలైనా రాలేదు. ఆమె ఎందుకో నిరాశకు గురైంది. తీవ్రమైన మనస్థాపానికి గురైంది. ఆమెలో కూడా విసుగూ విషాదం సుళ్ళు తిరుగుతున్నట్లు అనిపించింది.**

**మి**ట్ట మధ్యాహ్నం అనుకోకుండా అకస్మాత్తుగా వర్షం ప్రారంభమైంది. ప్రారంభమే కుండపోతగా ఉంది. ఆమె పడమటి గది తలుపులు గబగబా వేసేసింది. కిటికీ తలుపులూ లాగేసింది. ఒక కిటికీ రెక్క మాత్రం తెరచి, వర్షపు ఉధృతాన్ని గమనించసాగింది. దూరంగా పడమటి కొండల్లోంచి ఉరకలెత్తుతున్న నీటి ప్రవాహవేగం మంద్ర స్థాయిలో వినిపిస్తోంది.

రెండు చేతులతో గుండెల్ని అదిమి పట్టుకుని "ఓరి దేవుడా..! నేను ఇట్లా ఎప్పుడేడుస్తాను? గుండెలు పగిలేలా ఉరుములు మెరుపులతో కంపించి పోయేట్లు ఎప్పుడేడుస్తాను?" అనుకుంది. కిటికీ ఇనుప చువ్వలకు బుగ్గల్ని ఒత్తి పెట్టింది. నిస్సహాయంగా ఓసారి వెనక్కి తూలి, మళ్ళీ కిటికీ అరగు ఎక్కి తల మోకాళ్లకు ఆనించి కూర్చుంది.

ముందుగదిలో ఆమె భర్త ఓ పాత ఈజీ ఛైర్‌లో వాలిపోయి, పేపర్ చదువుతున్నాడు. బాగా మబ్బు పట్టి ఆకాశం నలుపెక్కగానే అతను లేచి లైట్ వేసుకున్నాడు. వర్షపు జల్లుకు తడిసి పోతున్న పరదాని, డోర్ మ్యాట్‌ని పట్టించుకోకుండా లేచి తలుపులు వేసేశాడు. గాలి వేగానికి, వర్షపు జోరుకు పరదా తడిసి ఎగిరిపడుతూనే ఉంది. పరదా చిలికే నీటికి పుస్తకాలు, తడిసి పోతాయేమోనని... ఆమె సోఫా దగ్గర కింద పరిచిన పుస్తకాలు, మ్యాగజైన్లు తీసి బుక్ షెల్ఫ్‌లో సర్ది..., అతను మళ్లీ పేపరు పుచ్చుకుని కూర్చున్నాడు. వెనక్కి విశ్రాంతిగా ఒరిగాడు.

ఈలోగా పిల్లలు చిత్తు కాగితాలేవో తెచ్చుకుని, ఆయన పక్కనే కూర్చుని పడవలు తయారు చేశారు.. ఆయన్ని మాటి మాటికీ తడుముతూ "నాన్న గారూ! తలుపు తీయండి!!" అంటూ మారాం చేయసాగారు. "ఊఁ ఊఁ" అనడమేగాని ఆయన పేపర్‌లోంచి బయట పడలేదు.

"ఓసారి తలుపు తీయండి" అని చిన్నారి తనయుడు ఆయన చొక్కా పట్టుకు లాగాడు. కాగితపు పడవను చొక్కాలోకి దోపాడు. అటూ ఇటూ ఊపాడు.

"పడవలా? ఇంకా ఏమైనానా? బయట ఎంత వర్షం పడుతుందో కనబడడం లేదూ... తడిచారంటే జ్వరం వస్తుంది" అతను పేపర్లోంచి దృష్టి మరల్చకుండానే కోపంగా చెప్పాడు. చిన్నారి తనయుడిక్కూడా కోపం వచ్చింది. ఏడిస్తే పనేమైనా జరుగుతుందా అన్నట్టు అతను అక్క వైపు భావ గర్భితంగా చూశాడు. ఏం ఫరవాలేదు. కాసేపు ఆగు అన్నట్లు ఆమె కళ్ళతోనే సమాధానం చెప్పింది. తమ్ముడు చేసిన పడవలాగా కాకుండా...ఆమె మరింత జాగ్రత్తగా మరో మంచి పడవ చేయడానికి ప్రయత్నిస్తోంది. చేతి వేళ్ళ మధ్య కాగితం సరిగా మడతలు వేస్తూ, గోటితో అంచులు రాస్తూ, సొగసైన పడవ తయారీలో నిమగ్నమైపోయింది. తమ్ముడు కాసేపు అక్క పనితనాన్ని పరీక్షగా చూశాడు. కాని వెంటనే చికాకు పడ్డాడు. "కాసేపైతే వర్షం కాస్తా ఆగిపోతుంది. అప్పుడా కత్తి పడవ, సుత్తి పడవ ఎక్కడేసుకుంటావూ" అని విసుక్కున్నాడు.

"అక్కా పడవే" అన్నాడు.

"ఆగు ఒక్క నిముషం..!!" అంది చిన్నారి అక్క.

చడీ చప్పుడు లేకుండా అక్కాతమ్ముళ్లిద్దరూ కిటికీ గ్రిల్స్ ఎక్కి చేతులు బయటికి చాపి ఇంటి ముందున్న నీళ్ళలోకి పడవల్ని విసిరేశారు. తమ్ముడి పడవ నీళ్ళలో అటూ ఇటూ ఊగి కదలకుండా నుంచుంది. అక్క పడవ హాయిగా ప్రవాహంలో కొట్టుకుపోయింది.

"చూశావా.! నీకు పడవ చేయడం కూడా రాదు. అది అక్కడే ఎలా నిలబడిందో చూడు" అంది.

"మీరిద్దరూ ఆ కిటికీ లోంచి ఇలా రండి తడిచిపోతారు" అని అన్నాడు వాళ్ల నాన్న... పేపర్లోంచి ముఖం తిప్పకుండానే. "చెప్పొద్దు" అన్నట్టు సౌంజ్ఞ చేస్తూ తమ్ముడు కిటికీ గ్రిల్‌కి అతుక్కుని అలాగే ఉండి పోయాడు కాసేపు. వర్షం మరింత ఉధృతం అయినట్లు జల్లు పెద్దగా శబ్దం చేస్తూ పడుతోంది. పడమటి ఆకాశంలో బరువైన మేఘాలు కదులుతున్నాయి. దట్టమైన నీటితెర ఏదో కప్పేసినట్లు దూరపు కొండలు కనబడడంలేదు. వర్షం ఆ ఇంటి ఇల్లాలిని నిస్సహాయురాలిని చేసినట్లుంది. అక్కడ చెయ్యడానికి ఏముందనీ? ఆమె తనని తాను ఓదార్చుకుంది.

అయినా నేనెందుకేడుస్తున్నాను? ఎందుకు? ఆమె తనని తాను ప్రశ్నించుకుంది. తనలో ఏదో తెలియని వ్యధ. వెలితి. ఒంటరితనం? ఉన్న ఫళాన సపోటా చెట్టు కొమ్మ నుంచి ఒక చిన్న పక్షిగూడు రాలిపడింది చెట్టు మొదట్లో. సుళ్ళు తిరుగుతున్న నీటిలో అది గిరగిరా తిరిగి కొట్టుకు పోయింది. పక్షిపిల్ల చచ్చిపోతుందేమోనని ఆమె వెంటనే తలుపు తెరచి ఇంటి ముందు ఖాళీ స్థలంలోకి పరుగెత్తింది. నీటిలో కొట్టుకుపోయే గూటిని వెతికి పట్టుకుంది. మురికి నీళ్ళన్నీ ఆమె కాళ్ళ మీద పడ్డాయి. పక్షి పిల్ల నీళ్ళలో తడిచి, వణుకుతోంది. దానికింకా రెక్కలైనా రాలేదు. ఆమె

ఎందుకో నిరాశకు గురైంది. తీవ్రమైన మనస్థాపానికి గురైంది. ఆమెలో కూడా విసుగూ విషాదం సుళ్ళు తిరుగుతున్నట్లు అనిపించింది. పైన సపోటా చెట్ల కొమ్మలకు నిస్సహాయంగా ఊగుతూ కనిపించిన పక్షి గూళ్లను చూస్తున్నప్పుడు... "ఏమిటి? ఏమైంది నీకు? అలా వర్షంలో ఎందుకు తడుస్తున్నావ్" అని భర్త గుమ్మంలో నిలబడి కోపంగా అన్నాడు.

"అమ్మ వర్షంలో తడిచిపోతోంది" అన్నాడు చిన్నారి తనయుడు. అంతకంటే మంచి అవకాశం దొరకదని వాడు మెల్లగా తండ్రి కాళ్ల మధ్య లోంచి బయటకు జారుకున్నాడు. అంతకుముందు కిటికీలోంచి విసిరేసిన పడవను పునరుద్ధరించి మళ్లీ ప్రవాహంలో వేశాడు. అది అప్పటి దాకా నీళ్లలో బాగా నాని ఉంది గనుక... ఒక పేపర్ ముద్దలా కొట్టుకుపోయింది.

"పిచ్చి పడవ చేస్తే తేలుతుందా యేం?" అంది వాడి అక్క. వాడు ఉక్రోషంతో కోపంతో అక్కని వెక్కిరించాడు. దానికి ప్రతిచర్యగా తను ఏదో చెయ్యాలి అన్నట్లు "నాన్న గారూ! వాడు చూడండి. వర్షంలో ఎలా తడుస్తున్నాడో, తలంతా పచ్చి ముద్దయిపోయింది కూడా" అని కూతురు తండ్రికి ఫిర్యాదు చేసింది.

"తడవనీ, అదిగో వాళ్ళమ్మ తడుస్తోంది కదా! అందుకే వాడూ వెళ్ళాడు". ఆమెకు ఎక్కడో దెబ్బ తగిలినట్లయి, కొడుకు వైపు పరుగెత్తింది. ఒక చేత్తో పక్షిగూడు పట్టుకుని, మరో చేత్తో వాడిని కోపంగా లోపలికి తోసింది.

"వర్షంలో తడవకు వెళ్ళు! లోపలికి వెళ్ళు!!" అంది. తల్లిలో వచ్చిన ఆకస్మికమైన మార్పును వాడు ఊహించుకోలేకపోయాడు. "అందరూ నన్నే అంటారు!" అని బుంగ మూతి పెట్టాడు.

"ఏమిటీ నువ్వు ఇంట్లో కొస్తావా? అలాగే తడుస్తావా?" అడిగాడు అతను భార్యను.

"రాను, ఇలాగే తడుస్తాను" అంది ఆమె.

"అయితే సరే, వాడూ అంతే" అంటూ లోపలి గదిలోకి వెళ్లిపోయాడు.

"అమ్మ ఎందుకలా చేస్తోంది ?" అడిగింది కూతురు తండ్రిని.

"పిచ్చి చాలా రకాలుగా ఉంటుందిరా! అందులో మీ అమ్మది చాలా ప్రత్యేకమైనది" అన్నాడు. ఆమె కూతుర్ని తీక్షణంగా చూసి, కొడుకును దగ్గరికి లాక్కుంది. "పిచ్చి సన్నాసీ నువ్వెందుకురా! వర్షంలో తడవడం!! జ్వరం వస్తే నువ్వే కదా బాధపడేది?" అంటూ తల తుడిచింది.

కొద్ది సేపటి తర్వాత పొలాలనుండి ఊళ్ళోకొస్తున్న ఆడకూలీలు వారి ఇంటి ప్రహరీ గోడ పక్కనే నిలబడ్డారు. వారి తాటాకు గొడుగుల మీద వర్షం పెద్దగా చప్పుడు చేస్తోంది. వాళ్ళు తన భార్య వర్షంలో నిలబడి ఉండడాన్ని చూస్తున్నందుకు అతను విసుక్కున్నాడు. "పద్మా..! లోపలికి రా...!!" అన్నాడు. నెమ్మదిగా ఆమె ప్రతి స్పందించలేదు. అతనివైపు కూడా చూడలేదు. పక్షిగూడుని హృదయానికి హత్తుకుని అలాగే వర్షంలో నిలబడింది. పిచ్చి వర్షంలో పిచ్చిగా తడిసింది. దారిన పోయేవాళ్ళు ఒక్కొక్కరూ ఒక్కోసారి చోద్యమేమిటా అన్నట్లు చూస్తూ వెళ్తున్నారు. అతను తగ్గు స్వరంతో "ష్... నిన్నే..!" అని గద్దించాడు. పళ్ళు బిగబట్టి "ఒళ్ళు మదమెక్కిందా?" అని గుద్దులురిమాడు.

ఆమె గుండె మండిపోయింది. ద్వేషం అసహ్యం గుప్పుమన్నాయి. చేతిలోని చిన్నారి పక్షిని పిడికిల్లో బిగించింది. గట్టిగా నలిపేసింది. దాని లేత ఎముకలు పటపటమనడం కూడా వినిపించింది. ఏదో ఒక పైశాచిక ఆనందం...!

అతను భళ్ళున తలుపేసుకున్నాడు. అది భరించలేక -

చిన్నారి పక్షి రెండు మూడుసార్లు కొట్టుకుని, ఆమె చేతిలో ప్రాణం వదిలింది. పక్షి కనుగుడ్లు తేలేసింది. అకస్మాత్తుగా ఆమెలో ఏదో భయం ఆవహించింది. చచ్చిన పక్షిని గడ్డిలోకి విసిరేసింది. కొద్దిసేపట్లోనే సపోటా చెట్టు మీదున్న పక్షులన్నీ కిందికి వచ్చి, చచ్చిపోయిన పక్షి చుట్టూ చేరాయి. వాటి ఈకలన్నీ తడసి ముద్దయ్యాయి. వాటి అరుపులు వర్షం చప్పుడును మించిపోయాయి. ఆమె చేతికి అంటుకుపోయిన తడి ఈకలు ఆమె ఒక హంతకురాలని గుర్తుచేస్తున్నట్లుగా ఉన్నాయి. ఆ ఆలోచనతో చలించిపోయి ఆమె చేతులు రుద్దుకుంది. పక్షులు ఆమె చుట్టూ చేరి అరవడం ప్రారంభించాయి. ఆమె తన తప్పిదాన్ని గుర్తుచేసుకుని బాధపడింది. అసలు ఆమె చెయ్యదల్చుకున్నది అది కాదు. ఏదో చెయ్యాలనుకుని ఏదో చేసింది. రెండు చేతులతో కొద్దిసేపు ముఖం దాచుకుంది. వెంటనే ఏదో గుర్తుకు వచ్చినట్లు కొడుకుని దగ్గరికి లాక్కుంది. కొద్దిసేపటి క్రితం కోపంగా అరిచిన వాడినే ఇప్పుడు మళ్ళీ ప్రేమగా దగ్గరికి లాక్కుంది. పిచ్చిదానిలా ఇంటివైపు పరిగెత్తి గుమ్మానికి ఒరిగిపోయింది. ఆ పరుగెత్తడంలో రెండు మూడు సార్లు కిందపడబోయి నిలదొక్కుకుంది. తడిసి ముద్దయిన చీరలోంచి, తలవెంట్రుకల్లోంచి నీరు కారి పోతోంది. రెక్కలు తడిసిన పక్షులకు, బట్టలు తడిసిన ఆమెకూ పెద్ద తేడా లేదు. గజగజ వణికి పోవడంతో కూడా భేదం లేదు.

"ఊం అయిందా..! బాగైందా...!!" అతను హేళనగా అరిచాడు. ఆమె లోలోపలే ఏదో గొణుక్కుంది. వీడికోసం ఓపిక పడుతున్నాను. లేకపోతే నీ బెదిరింపులు ఎవరికీ? అన్నట్లు మనసులో ఏవేవో అనుకుంది. తలుపు తెరవమని బిగ్గరగా అరవాలనుకుంది. కాని గొంతు సహకరించలేదు. ఎంతో ప్రయత్నిం మీద "తలుపు తెరవండి ప్లీజ్! " అంది. ఆ స్వరం సన్నగా, బలహీనంగా నిస్సహాయంగా ఉంది. వర్షపు హోరులో ఆ మాట పెద్దగా వినిపించనూ లేదు. అయినా ఆమె ఏమంటోందో అతనికి పూర్తిగా అర్థమైంది.

అతను తలుపు తరచి ఓ క్షణం గుమ్మంలో నిలబడ్డాడు. "ఈ మొండితనం, తల బిరుసూ ఆడదానికి శోభించవు" అంటూ వెనక్కి తిరిగి వెళ్ళిపోయాడు.

ఆమె అతనికి జవాబు చెప్పలేదు. ఆ మాటను పట్టించుకున్నట్లు కూడా లేదు. లోపలి గదిలోకి వెళ్ళి బట్టలు మార్చుకుని, తల తుడుచుకుంది. చంటాడికి కూడా తలా ఒళ్ళూ తుడిచి, బట్టలు మార్చింది. ఆటలు ఆడి అలసిపోయి ఉన్నాడు కాబోలు వాడు వెంటనే నిద్రపోయాడు. ఆమె వాడి పక్కనే కూర్చుని చాలాసేపు వాడి ముఖంలోకి చూసింది. వంగి ముద్దు పెట్టుకుందామని అనుకుంది. కానీ ఎందుకో హఠాత్తుగా వెనక్కి వచ్చింది. వాడి ముఖం పరిచయం లేని ముఖంలా అనిపించింది. "ఏమైంది నాకు?! నాలో ఎందుకింత విషాదం? ఎందుకింత వేదన? ఎందుకింత ఒంటరితనం?"

వాళ్ళమ్మాయి కూడా మెల్లగా గదిలోకి వచ్చింది. ఆ చిన్నారి ముఖం దిగులుగా ఉంది. తను నలిపి పారేసిన పక్షి గుర్తుకొచ్చింది. తన కూతురు ముఖంలోని అమాయకత్వం, సున్నితత్వం ఆ చిన్నారి పక్షిలో కూడా ఉండే ఉంటాయి. కూతుర్ని గబుక్కున లాక్కుని గుండెలకు హత్తుకుంది. "పాపా..! నువ్వు కూడా పడుకో" అంది సౌమ్యంగా.

ఆ పిల్ల బిక్కుబిక్కుగా తల్లిని చూస్తూ తన మంచం మీద పడుకుంది. కానీ, తల్లి ముఖంలోకి అనుమానంగా చూస్తూనే ఉంది. "ఎప్పటికైనా నువ్వు అర్థం అవుతావా అమ్మా" అన్నట్టు ఉందా చూపు. పిల్లలిద్దరికీ దుప్పటి కప్పి ఆమె వాలు కుర్చీలో వాలిపోయింది.

పిల్లలు..! నష్ట జాతకులు..!! నేను వీరికి తల్లి కాకుండా ఉండాల్సింది. నేను వీళ్లని ప్రేమించడం లేదా? నిజమే ప్రేమించడం లేదు. కాబోలు! ఓరి దేవుడా...! నీవైనా చెప్పు..!! నేను వీళ్ళని ప్రేమిస్తున్నానో లేదో! అయినా నువ్వు చెప్పేదేమిటీ..? నేను వీళ్ళని ప్రేమిస్తున్నాను. నాకన్నా, నా జీవితం కన్నా అధికంగా ప్రేమిస్తున్నాను. కానీ, వీళ్ళకు ఇంకా మంచితల్లి ఉండాల్సింది.! ఎంత ముద్దొస్తారు పాపం? ఇంతకన్నా మంచి అమ్మ ఉండాల్సింది.!! కానీ నా మనసు నిజమే చెప్తుందే. నేను వీళ్ళను మనస్ఫూర్తిగానే ప్రేమిస్తున్నాను..! అనుకుంటూ ఇద్దరి బుగ్గల్ని ముద్దాడింది. అయోమయంగా నిద్రపోతున్న వాళ్ళ ముఖాలు పక్షి గూటిని జ్ఞాపకం చేశాయి. చంటివాడి మెడ తిప్పేసినట్లు, పాప ఎముకలు పటపటా విరిచేసినట్లు...!! ఒక్క క్షణం గజగజ వణికి పోయి నిస్పృహతో చేతులు నలుపుకుంది. ఏదో భయంకరమైన ఊహ.

ముందుగదిలో ఆమె భర్త పాప్ మ్యూజిక్ వింటున్నాడు. అతనికి ఇష్టమైన ఆ లయ, ఆ ధ్వనులు ఆమెకు అసహ్యం.

అతడు కావలనే తనను గేలి చేస్తున్నాడనే అనిపించింది ఆమెకు ఆ క్షణం.

నాకింక శక్తిలేదు. ఓపిక లేదు. ఓరి భగవంతుడా..! నన్ను ఎందుకింకా పరీక్షిస్తావు? నన్ను ఎందుకింత ఒంటరిని చేశావ్? ఆమె పిల్లలవైపు చూసింది. వాళ్ళు పరాయి వాళ్ళలాగా అనిపించారు. తనకు తానే పరాయిదై పోయినట్లు నిలువునా కుప్పకూలిపోయింది.

ఒక్కసారి ఊహించని వర్షంలా ఆమె కళ్ళనుండి జోరుగా నీళ్లు కారాయి. ఉండి ఉండి వచ్చే ఉరుముల్లా ఆమె పెద్దగా ఆక్రోశించింది. ఏడ్చింది. ❋

**ఆమె అతనికి జవాబు చెప్పలేదు. ఆ మాటను పట్టించుకున్నట్లు కూడా లేదు. లోపలి గదిలోకి వెళ్ళి బట్టలు మార్చుకుని, తల తుడుచుకుంది. చంటాడికి కూడా తలా ఒళ్ళూ తుడిచి, బట్టలు మార్చింది. ఆటలు ఆడి అలసిపోయి ఉన్నాడు కాబోలు వాడు వెంటనే నిద్రపోయాడు. ఆమె వాడి పక్కనే కూర్చుని చాలాసేపు వాడి ముఖంలోకి చూసింది. వంగి ముద్దు పెట్టుకుందామని అనుకుంది. కానీ ఎందుకో హఠాత్తుగా వెనక్కి వచ్చింది. వాడి ముఖం పరిచయం లేని ముఖంలా అనిపించింది. "ఏమైంది నాకు?! నాలో ఎందుకింత విషాదం? ఎందుకింత వేదన? ఎందుకింత ఒంటరితనం?"**

# నాగమల్లి కోనల్లోంచి వచ్చిన సొగసులు...!

డా॥ జె.పి.వైద్య

జమునా రాణికి తెలుగు సినీ సంగీతం దునియాలో ఒక విశిష్టమైన స్థానం ఉంది. విచిత్రమైన గమకం.. ముక్కు స్వరమైనా గాత్రం నిండా హుషారు తనం.... జానపద రీతుల్లో సాగే విసురుతనం... గంతులేయకపోతే ఎలా? అనే ప్రశ్న చిహ్నం....? వీటన్నింటికి అతీతంగా 'ఓహో!' 'ఆహో! అనే మనమూ ఉన్నాం కదా! ఇవన్నీ 'జమునా రాణి ప్రత్యేకతలు! అందుకే 'జమున' మన అందాల ఎవర్ గ్రీన్ హీరో 'నాగేసర్రావు' గారినీ అంతగా ముక్కు పట్టి ఆడించి ముప్ప తిప్పలు పెట్టగలిగారు. మనం వెర్రి గంతులేసినా పెద్దోళ్ళు 'పోనీ రాదూ! పాటల దమ్మున్నది బై ! మరి, పొల్లగాండ్లు ఎగరమన్రీ అంటే ఎట్ల ఆగుతరు బై...!' అని నోరు మూసుకున్నారు.

'మూగమనసులు'లో సావిత్రి

"అందుగలడిందులేదని సందే హము వలదు"- అన్నట్టు ఉత్తరాది వాళ్ళ హిందీ అయితేనేం, మన దక్షిణాది తెలుగు సినీ గీతాల విచిత్ర విశ్వం అయితేనేం విసురుగా వచ్చి అలజడి రేపే కొంటె గీతాలు అందరికీ నచ్చినవే.

అందరి గుండెల్లో ఆదరాభిమానాలు పొంది, గుండెల్లో గూడు కట్టుకొని 'చిరుయవ్వన గీతాలూ' అంటూ ముద్రేసుకొని మరీ మురిపించిన గీతాలెన్నని పేర్కొనాలి?

హిందీ సినీ దునియాలో అణకువగా, ఒదిగిమదిగి ఉన్న లతామంగేష్కర్ కూడా అప్పుడప్పుడు చెలరేగి పోయి 'మై క్యా కరూఁ రామ్ ముఝే బుడ్డా మిల్ గయా' అని 'నేనూ పాడగలుగుతాను బాబూ!' అనే భరోసా ఇచ్చింది.

వైజయంతి మాల 'ఝట్కా'ల వైపుకు రాజ్‌కపూర్ కూడా 'సంగం'లో రంగుల స్వప్నాలు అందించి మనల్నందర్నీ 'పాగల్' చేసి పారేసిన ముచ్చట అన్ని తరాల వాళ్ళం ఆనందించాం కదా!

గీతా దత్, ముబారక్ బేగమ్, ఆషా భోంస్లే ల గీతాల గురించి రాస్తూ పోతే 'మహాగ్రంథం' అవుతుంది. కాబట్టి, ప్రస్తుతం ఆ జోలికి వెళ్ళదలచుకోలేదు. మనం తెలుగువాళ్ళం 'బాలీవుడ్' వాళ్ళ కన్నా ఏ మాత్రం తీసిపోని 'మహాన్' వాళ్ళమే!

ఉదాహరణలిచ్చినా మరో 'మహా గ్రంథం' అవుతుంది.- కాబట్టి మనం టూకీగా 'మూగమనసులు' చిత్రంలోని ఒక్కగానొక్క గీతం 'జబర్ దస్త్ మహిమ' గురించే ముచ్చటిం చుకుందాం.

నిర్మాత సుందరం, దర్శకులు ఆదుర్తి సుబ్బారావు, సంగీత దర్శకుడు కేవీ మహదేవన్, మన ఎవర్‌గ్రీన్ అందాల అలనాటి జోడి 'నాగేసర్రావ్- సావిత్రి'లతో పాటు, జమున, నాగభూషణం, పద్మనాభం, గుమ్మడి లాంటి హేమాహేమీలు '1964'లో మనకందించి 'హోల్ టోటల్'గా కట్టి పారేసిన గొప్ప కళా ఖండం 'మూగ మనసులు'.

హిందీలో 'మధుమతి' లాంటి పునర్జన్మ తాలూకు 'మ్యూజికల్ మెలోడీస్' వచ్చాయి. మూగమనసులు మన తెలుగు వారి పునర్జన్మ తాలూకు 'గుండెదడ'లా 'బాబూ మూవీస్' పతాకాన్ని గర్వంగా రెపరెపలాడించింది.

అది ఆ తర్వాత 'నూతన్'-సునీల్ దత్- జమున'లతో 'మిలన్' అనే హిందీలోనూ వచ్చి 'బాజా' బజాయించి వీర విహారం చేసింది.

మనం 'మూగ మనసులు' వైపు వచ్చి మన పాత ముచ్చట్లను తట్టి లేపుదాం. కేవీ మహదేవన్/ ఆత్రేయల 'జాదూ' నేటికీ 'చిరుయవ్వనం'.... జ్ఞాపకం చేసుకోండి- ఆణిముత్యాల్లాంటి జబర్‌దస్త్ గీతాలు! దేనికదే సాటి! ఒకదాని కన్నా మరోటి మేటి!!.

- 'ఈనాటి ఈ బంధమేనాటిదోఁఁ'
- 'నా పాట నీ నోట పలకాల సిలకా'
- 'గౌరమ్మాఁ నీ మొగుడెవరమ్మా?'
- 'ముద్ద బంతి పూవులో - మూగ కళ్ళ వూసులో'
- పాడుతా తీయగా సల్లగా'

అన్నీ అద్భుతమైన మణి పూసలే! అరుదైన రత్నాలే!!

కాని- అన్నింటిలోనూ కాస్త భిన్నంగా మరో అల్లరి చిల్లరి హిట్ పాట ఇంకా అందరి గుండెల్లోనూ 'గోల' చేసి పోయిది.

అది 'ముక్కు మీద కోపం - నీ ముకానికే అందం

నా బుంగమూతి చందం- నీ ముందరి కాళ్ళ బందం...' అంతటితో ఆగకుండా 'వూఁ వూఁ అని మనల్నందర్నీ కితకితలు పెట్టింది.

అలనాడూ, నేడూ ఆ పాటను విన్న వాళ్ళెవ్వరూ అటూ ఇటూ ఊగకుండా, ఆనందంతో 'ఈల' లేయకుండా ఉండలేరు.

అది కె. జమునా రాణి ఎంతో హుషారుగా పాడిన, కొంటె తనం నిండిన గీతం. 'జమున' అంతే చలాకీగా, రెట్టింపు హుషారుగా నటించి... కాదు... జీవించి ఆ పాత్రను 'యాద్‌గార్' చేశారు.

జమునా రాణికి తెలుగు సినీ సంగీతం దునియాలో ఒక విశిష్టమైన స్థానం ఉంది. విచిత్రమైన గమకం.. ముక్కు స్వరమైనా గాత్రం నిండా హుషారు తనం.... జానపద రీతుల్లో సాగే విసురుతనం... గంతులేయకపోతే ఎలా? అనే ప్రశ్న చిహ్నం....? వీటన్నింటికి అతీతంగా 'ఓహో!' 'ఆహో! అనే మనమూ ఉన్నాం కదా! ఇవన్నీ 'జమునా రాణి ప్రత్యేకతలు!

అందుకే 'జమున' మన అందాల ఎవర్ గ్రీన్ హీరో 'నాగేస్రావు' గారినీ అంతగా ముక్కు పట్టి ఆడించి ముప్పు తిప్పలు పెట్టగలిగారు. మనం వెర్రి గంతులేసినా పెద్దోళ్ళు 'పోనీ రాదూ! పాటల దమ్మున్నది భై ! మరి, పొల్లగాండ్లు ఎగరమన్రీ అంటే ఎట్ల ఆగుతరు భై...!' అని నోరు మూసుకున్నారు.

మే 17-1938 నాడు మద్రాసులోని 'షావాలెస్' కంపెనీలో పనిచేసే కె వరదరాజులు నాయుడు- ద్రౌపదీ దంపతుల సంతానం 'జమునా రాణి'. పుట్టి, పెరిగింది మద్రాసులో.

కన్నతల్లి శాస్త్రీయ సంగీతం తెలిసినావిడ. అందువల్ల బాల్యం నుండే 'సరిగమలు' చెవుల్లో గూడు కట్టుకున్నాయి. తల్లి ప్రొఫెసర్ సాంబ మూర్తిగారి ఆర్కెస్ట్రాలో వీణ వాయించే వారు. రేడియోలో పాడేవారు కూడా. తల్లి వెంబడి వెళ్తూ చిన్నారి జమునారాణి 'సంగీత స్వరాలతో' దోస్తీ చేసింది. కష్టపడకుండానే చక్కగా 'స్వర జ్ఞానం' అబ్బింది ఆమెకు. అయితే 'శాస్త్రీయ సంగీతం' కన్నా 'హల్కా ఫుల్కా లైట్ మ్యూజిక్' అంటేనే మక్కువ ఎక్కువగా ఉండేది.

ఏడు సంవత్సరాల చిరుప్రాయంలో 'తాసిల్దార్' (1944)లో పద్మనాభశాస్త్రి సంగీతంలో 'ఆహా..ఏమందునే చినవదినా' అని పాట పాడే అవకాశం వచ్చింది. ఆ సమయంలోనే చిత్తూరు నాగయ్య 'త్యాగయ్య' తీసే ప్రయత్నంలో ఉన్నారు. భరణి రామకృష్ణ ఆయనకు అసిస్టెంట్‌గా ఉండేవారు. ఆ రోజుల్లో ఆయన వరదరాజులు గారి ఫ్యామిలీ ఫ్రెండ్. జమునారాణి గాత్రం సంగతి బాగా తెలిసినవాడు. నాగయ్య గారికి చిన్న పిల్లల కోసం పాడే గొంతుకల వేట తప్పింది. ఎ.పి. కోమలతో కలిసి జమునా రాణి 'మధురానగరిలో..." అనే జావళీ పాడింది.

భరణి వారి 'రత్నమాల' (1954)లో సి.ఎస్.ఆర్, భానుమతితో కలిసి 'పోయిరా.. మా తల్లి', రక్త కన్నీరులో 'వగలాడి నిను చేరురా'అనే నాట్యగీతం కూడా పాడింది.

ఆ రోజుల్లో 'ప్లే బ్యాక్' సింగర్స్ పద్ధతి ఉండేది కాదు. పి. శాంతకుమారి, ఎస్. వరలక్ష్మి, జి. వరలక్ష్మి, బెజవాడ రాజారత్నం, టి.జి. కమలాదేవి...అందరూ స్వంతంగా పాడుకున్న వాళ్ళే!

'శివగంగ'లో పెండ్యాల చక్కటి పాటలు పాడించారు. అలనాటి ప్రగతి స్టూడియోలో అవి రికార్డైనా, చిత్రం- రికార్డ్స్ రిలీజ్ కాలేదు.

సినిమాల్లో పోయిన తొలిగీతం 'ద్రోహి' (1948) చిత్రం లోనిది. ఆవిడ గానం చేసిన పాటలు ముచ్చటగా మూడు.

-'ఆలకించండి బాబూ ఆదరించండి...'

-'ఎందుకీ బ్రతుకు.. ఆశలే నిరాశలాయెనే...'

- 'ఇదియేనా నీ న్యాయము'

ఆ రోజుల్లో రికార్డ్స్ మీద నేపథ్య గాయనీ, గాయకుల పేర్లు ప్రింట్ అయ్యేవికావు. అందువల్ల పాటలు జనాదరణ పొందినా, రసిక జనానికి 'గాయనీ గాయకులు' ఎంతో పాపులర్ అయితే తప్ప తెలిసేది కాదు.

ఆ తర్వాత వచ్చింది వినోదా వారి సదాబహార్ ట్రాజెడీ 'దేవదాసు' (1953). ఉడుత సరోజిని తో కలిసి పిల్ల పార్వతి పాట 'ఓహో దేవదా....' పాట అది. బ్రహ్మాండంగా ప్రజాదరణ పొందిన గీతం. గుర్తింపును జేబులో నింపుకొచ్చిన పాట.

1952-55 వరకు సుమారు 15 సినిమాల కోసం పాడినా - అందులో ఎక్కువగా పేరు ప్రఖ్యాతులు 'తమిళ'చిత్రాల ద్వారానే వచ్చాయి.

హిందీలో లతామంగేష్కర్ - మొహమ్మద్ రఫీ కలసి పాడిన యుగళగీతం 'చలి చలిరే పతంగ్ మెరీ చలిరే' ఎంతో పాపులర్ గీతం. కులదైవంలో మాస్టర్ వేణూ సంగీత సారథ్యంలో ఆ పాటే అనువాద గీతమై - 'పద పదవే ఒయ్యారి గాలి పటమా....' మరో పాట 'కోటు బూటు వేసిన బావ వచ్చాడయ్యా' తెలుగునాట ప్రకంపనలు సృష్టించాయి.

మన వెనక తరాల పెద్దోళ్ళు చెవులు రిక్కించి లేచి కూర్చున్నారు. 'జమునా రాణి' సత్తా మనకు అర్థమైపోయింది.

సినిమా సృష్టి మాయల ప్రపంచం. అక్కడ అందరూ నిలదొక్కుకోవడం చాలా కష్టం. ఎంతో విలక్షణమైన ప్రతిభాపాటవాలు ఉన్నా ఏదో ఒక చిన్న కారణం చాలు వెనక్కి తోసేయడానికి.

'కొంటెపాత్రలకూ, వేళాకోళం పట్టించే పాత్రలకూ, బావలను ఏడిపించే మరదలు పిల్ల పాత్రలకే బాగా సరిపోతావు అమ్మాయీ... హీరోయిన్ గొంతు కోసం మరొకరున్నారులే' అని చెప్పకనే చెప్పేవాళ్ళు కోకొల్లలున్నారు ఇండస్ట్రీలో.

ఒకానొక సమయంలో ఘంటసాల' అంతటి మహానీయుడు కాస్త ఇబ్బందిపడి 'కొంత డబ్బు సర్దగలరా?' అని ఎంతో లాభపడ్డ పేరున్న హీరోతో ఎంతో వినయంగా వేడుకుంటే - సదరు 'మహారాజు' ఓ పిచ్చి నవ్వు నవ్వి...'మన స్నేహం డబ్బు వల్ల దూరం కాకూడదు' అని వెధవ డైలాగ్ విన్పించాట్ట.

ఘంటసాల కాబట్టి విషణ్ణంగా నవ్వి వూరుకున్నారు. ఆ మాట వింటే మనలాంటి 'ముక్కుమీద కోపం తప్ప ఇంకా ఏమీ ఉండని' అపర రుద్రావతారం గాళ్ళం రక్కున వెళ్ళి ఏకీలు కాకీలు విడదీసి చేతుల్లో పెట్టి మరీ వచ్చేవాళ్ళం.

విలక్షణమైన గొంతూ, అద్భుతమైన ప్రతిభాపాటవాలు ఉన్నా 'జమునారాణి' రాజకీయ సినీ భేతాళ కథలో వెనకపడిపోయారు.

6000కు పైగా గీతాలు. అందులో 70-80% తమిళం- 20% తెలుగు - మిగతావి కన్నడం, మళయాళం, సింహళం పాటలు!

కొన్నిసార్లు జీవితం అనవసరంగా వికటాట్టహాసం చేసి భయపెడ్తుంది. కొంత మంది భయపడకుండా ఎదురొడ్డి, ఈది గెలుస్తారు.

కొంతమంది 'పోనీలెద్దూ!' అని తప్పుకుంటారు.

అప్పుడప్పుడు మలేసియా, సింహళం లాంటి దేశాలకు వెళ్ళి 'ప్రోగ్రాము'లు చేసి అలనాటి అందాలను అందించే జమునా రాణిని తలచుకొని మనలాంటి దర్దీ దీవానాలు ఏమనుకుంటాం?

ముక్కుమీద ఎంత కోపం ఉన్నా - ముందరి కాళ్ళకు బంధాలు ఏవో చెప్పలేని కారణాల వల్ల పడ్తూనే ఉంటాయి.

మనం కాస్త మొండిగా బంధాలు తెంచి - పాత పాటలు విని కొత్త సంగీతపు బంధాలను నిర్మించే ప్రయత్నం చేస్తే?

దొరికేది తృప్తి! లభ్యమయ్యేది అలౌకికమైన ఆనందం! సంగీత ప్రియులకు కావాల్సింది 'అదే'కదా!

❊

**దీనిపై మీ స్పందనను రచయితకు తెలియచేయవచ్చు.**

**ఫోన్ : 08732223622**






# అడిగిన సమాచారం ఇవ్వరే...

మీరు అక్టోబర్ 28, 2007న చెప్పిన సర్వే రిపోర్టు గురించి తెలుసుకున్నాం. కాని ఇక్కడ ఎంఆర్ఓ సర్వే చేసిన రిపోర్టు ఇవ్వకుండా సమాచార చట్టాన్ని ఉల్లంఘిస్తున్నారు. మేము సమాచార చట్టం కింద తగిన రుసుము చెల్లించాం. 30 రోజులు కూడా అయింది. ఈ విషయమై ఎంఆర్ఓ గారికి జరినామా ఏ విధంగా విధించాలో తెలియ జేయండి.

**మధు, ఉరవకొండ,** అనంతపురం.

సమాచార హక్కు చట్టం ప్రకారం ఏ ప్రభుత్వ అధికారి అయినా ... తన వద్ద నున్న పత్రాలను అడిగిన 30 రోజులలోపు తప్పనిసరిగా అందచే యాలి. అలా చేయని పక్షంలో ఆర్.డి.ఓ/పై అధికారికి దరఖాస్తు చేయండి. అప్పటికి స్పందించినట్ల యితే రాష్ట్ర స్థాయిలో గల కమిషన్ వారికి దరఖాస్తు చేయండి. వారు

చట్ట ప్రకారం అలసత్వం ప్రదర్శిం చిన అధికారికి జరిమానా విధించగల్గుతారు.




# లిమ్కా బుక్ లైసెన్స్

సార్ నేను ప్రకాశం జిల్లా, గిద్దలూరు పట్టణవాసిని. నా వయస్సు తొమ్మిదిన్నర సంవత్స రాలు. నేను 2005 సంవతర్సరం నుండి ఎంతో పట్టుదలతో మోటా ర్ సైకిల్ నేర్చుకున్నాను. నా చిన్న నాటి నుండి లిమ్కా బుక్‌లో నాపేరు నమోదు చేయించు కోవడానికి కృషి చేశాను. మా జిల్లా కలెక్టర్లను కూడా కలసి చెప్పాను. నేను మోటార్ సైకిల్ (హీరో హోండా వాహనం 125 సి.సి) సుమారు పది గంటల పాటు బండిని ఆపకుండా నడపగలను. 550 కిలో మీటర్లు నడపగలను. మారు 800 సిసి కారును ఒక గంటలో 90 కిలో మీటర్లు నడపగలను. నేను లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ యొక్క అడ్రసు సంపాదించి వారికి తెలియ పరిచినాను. వారు నాకు డ్రైవింగ్ చేయడానికి లీగల్‌గా డ్రైవింగ్ లైసెన్స్ ఉంటేనే నా విన్యాసం చూస్తామన్నారు. కావున నాకు తాత్కాలిక లైసెన్స్ ఇప్పిం చగలరా?

**షేక్ జమాల్ వలి,**ప్రకాశం.

మీ కృషిని, పట్టు దలని అభినందిస్తున్నాను. మైనర్ వయస్సు వారికి లైసెన్స్ మంజూరి చేయించాలంటే అది స్పెషల్ ప్రొవిజన్స్ కింద ఉన్న తాధికారులు మాత్రమే చేయ వలసి ఉంటుంది. మీరు రాష్ట్ర కమిషనర్ గార్కి స్వయంగా వచ్చి మీరు లిమ్కా బుక్ వారికిచ్చిన అప్లికేషన్స్, మీకిచ్చిన జవాబుని చూపిస్తూ ఫొటోలు, మీ తండ్రి గారి డిక్లరేషన్, మీ స్థానిక నాయకులు సర్పంచ్, ఎంఆర్ఓ ఎవరైనా మీ విన్యాసం చూసి వారితో డిక్లరేషన్ ఇప్పించి అవన్నీ తీసుకొని కల వండి. వారు స్పందించినట్ల యితే హైకోర్టులో రిటపి టిషన్ వేసి తగు ఉత్తర్వులు పొందవచ్చు.

## పాఠకులకు మనవి

మీకు లేదా మీవాళ్ళకు న్యాయ సంబంధమైన ఇబ్బందులేమైనా తలెత్తాయా? ఏం చేయాలో పాలుపోక సతమతమవు తున్నారా? అయితే వెంటనే ఆ సమస్యేంటో మాకు తెలియజే యండి. న్యాయవాది శ్రీ జి.ఎల్.నరసింహా రావు తగిన పరిష్కారాన్ని తెలియజేస్తారు.

మా చిరునామా: ప్రజాశక్తి, ఆదివారం అనుబంధం, స్టేట్ నెంబర్: 1, అశోక్ నగర్, హైదరాబాద్ - 500 020.

జి. ఎల్. నరసింహారావు
హైకోర్టున్యాయవాది,
9848994240







# తందూరీ చికెన్

**కావలసిన పదార్థాలు**

కోడి (బ్రాయిలర్)- 1 కిలో, అల్లం- 1 అంగుళం ముక్క, వెల్లుల్లి రేకులు-4, పుల్లని పెరుగు- 2 కప్పులు, ఉప్పు- తగినంత, పసుపు- చిటికెడు, నూనె- 1 కప్పు, మిఠాయిరంగు- చిటికెడు

**తయారు చేసే విధానం**

కోడిని శుభ్రం చేసుకొని 4 ముక్కలుగా కోసుకోండి. ఫోర్క్‌తో మాంసంలోకి బాగా గుచ్చి, గుల్ల చేయండి. అల్లం, వెల్లుల్లి నూరి ముద్ద చేయండి. ఒక పళ్ళెంలో ఈ ముద్దను పెరుగు పోసి కలిపి, అందులో పసుపు, ఉప్పు, మిఠాయిరంగు కలపండి. పెరుగు పుల్లగా లేకపోతే, కొంచెం నిమ్మరసం కలపవచ్చు. చికెన్ ముక్కలను ఈ మిశ్రమంలో వేసి అన్ని ముక్కలుగా బాగా పూయండి. దీనిని 3 గంటల సేపు అలా ఊరనివ్వండి (ఇలా ఊరిన ముక్కలు డీప్ ఫ్రిజ్‌లో 15 రోజుల వరకు నిలవ ఉంటాయి).

స్టౌ మీద బాణిలి పెట్టి, నూనె వేడిచేసి, ఊరిన ముక్కలను పిండి, నూనెలో వేసి వేయించాలి. ఉల్లిపాయను రింగులుగా కోసుకోవాలి. చికెన్ ముక్కల చుట్టూ ఉల్లి చక్రాలను అమర్చి, నిమ్మకాయను నాలుగు ముక్కలుగా కోసి పెట్టి, కోడి ముక్కలపై కడిగిన కొత్తిమీర ఆకులను చల్లి వడ్డించండి. ఓవెన్ ఉన్న వారు, ఇలా వేయించకుండా బేక్ చేసుకున్నా బాగుంటుంది. లేదా గ్రిల్‌లో గానీ, బొగ్గుల కుంపటిపైన సెగతో కాని కాల్చు కున్నా ఈ ముక్కలు బాగుంటాయి.



# మెంతి పరోటాలు

**కావలసిన పదార్థాలు**

మెంతి తరుగు- 1 కప్పు
గోధుమ పిండి- 1/2 కప్పు
వాము పొడి - 1 టీ స్పూను
కొత్తిమీర తరుగు- 1/4 కప్పు
కారం- 1/4 కప్పు
ధనియాల పొడి (ఇష్టపడేవారు) - 1 టీ స్పూను
శనగపిండి- 1/2 కప్పు

**తయారు చేసే విధానం**

శనగపిండి, మెంతి తరుగు, గోధుమ పిండిని తగినన్ని నీళ్లలో తడిపి వుండలుగా చేసుకోవాలి. ఒక్కొక్క పరోటా వత్తి రెండు వైపులా నూనె వేసి కాల్చాలి. ఇవి ఆరోగ్యానికి చాలా మంచివి. పెరుగుతో, ఊరగాయతో, గ్రీన్ చట్నీతో వడ్డించాలి.

# యాపిల్ రసగుల్లా



**కావలసిన పదార్థాలు**

యాపిల్ పేస్ట్ - 2 కప్పులు, బ్రెడ్ ముక్కలు -8
పంచదార - 2 కప్పులు, నీళ్ళు- 1 కప్పు,
బాదం తరుగు- 2 టీ స్పూన్లు
ఇలాచీ పొడి- 1 టీ స్పూను, నూనె - తగినంత

**తయారు చేసే విధానం**

బ్రెడ్ ముక్కల చివరలు కత్తిరించుకోవాలి. పంచదార, నీళ్ళు కలిపి లైట్‌గా పాకం పట్టి గోరువెచ్చగా ఉంచాలి. బ్రెడ్ ముక్కలను కొంచెం తడిపి, వాటి మధ్యలో యాపిల్ పేస్ట్‌ను పెట్టి మూసి రౌండ్‌గా రసగుల్లాల షేప్‌లో తయారు చేయాలి. వేడి నూనెలో వేసి బ్రౌన్ కలర్ వచ్చే వరకు వేయించాలి. వీటిని పాకంలో వేసి, పాకం బాగా పీల్చిన తరువాత తీసి బాదం తరుగును, ఇలాచీ పొడిని చల్లాలి. నోరూరించే యాపిల్ రసగుల్లాలు రెడీ!

# కాకరకాయల వేపుడు

**కావలసిన పదార్థాలు**

కాకరకాయలు- 1/4 కేజీ, పల్లీలు- 150 గ్రాములు
నూనె- 100 గ్రాములు, పెరుగు- 1 కప్పు
ఉప్పు, పసుపు, కారం- తగినంత, వెల్లుల్లి - 15 రెబ్బలు
జీలకర్ర- 2 స్పూన్లు

**తయారు చేసే విధానం**

కాకరకాయలు శుభ్రం చేసి, ఉప్పు, పెరుగు వేసి నీరు పోసి ఉడికించి వార్చి పక్కన పెట్టుకోవాలి. పల్లీలు, ఉప్పు, పసుపు, జీలకర్ర, వెల్లుల్లి పొడి చేసుకొని అందులో కారం కలపాలి. ఈ మిశ్రమంలో నూనె వేసి కలుపుకోవాలి. కాకరకాయ పొట్ట చీల్చి ఈ మిశ్రమం నింపాలి. కడాయిలో నూనె పోసి కాకరకాయలను సన్న సెగ మీద వేయించాలి. ఈ కాకరకాయ వేపుడు 15 నుంచి 25 రోజులు నిల్వ ఉంటుంది. ప్రయాణాలప్పుడు తీసుకువెళ్ళటానికి బాగుంటుంది. పాడవకుండా ఉంటుంది. పల్లీల బదులు పుట్నాల పప్పు కూడా వాడవచ్చు.

## అమెరికా అసలు రూపం తెలిపే పుస్తకం

**తల్లి:** అమ్మో! నా జీతం నుంచి ప్రభుత్వం ఎంత డబ్బు తీసేసుకుందో!

**కొడుకు:** అమ్మా! మా బడిలో మరుగుదొడ్లలో కాగితం కొనడానికి డబ్బులు లేవంట. కేకులు అమ్మడంలో నీ సహాయం కావాలంట.

**తల్లి:** ముందు పుస్తకాలు లేవన్నారు. ఇప్పుడు మరుగుదొడ్లలో కాగితం! మీ బడిలో ఏమున్నాయి?!

ఈసంభాషణ ఏబీద దేశ స్థులదో కాదు! అక్షరాలా అమెరికా ప్రజలది. ప్రపంచంలోనే అగ్ర దేశంగా... అభివృద్ధిచెందిన దేశంగా పేరొందిన అమెరికన్లది. "అదేంటి? ఎన్నో దేశాలమీద పెత్తనం చెలాయించడానికి, మార్కెట్ను మరింత విస్తరించుకోవడానికి, ప్రకృతి వనరు లన్నిటిని స్వాధీన పరచుకోవడానికి అమెరికా ఉపయోగించే ఆయుధం యుద్ధం కదా! ఆ దేశాల్లో... పిల్లలు, మహిళలు, వృద్ధులు అన్న తేడాలేకుండా బాంబుల వర్షం కురి పించి స్వాధీనం చేసుకున్న సంపద అంతా ఏమైంది మరి?! ఆ డబ్బుతో సమకూరిన సదుపాయాలతో అమెరికన్లందరూ తులతూగ దంలేదా? అక్కడి ప్రజలేమనుకుం టున్నారు? పాలకులు సాగిస్తున్న దారుణ యుద్ధాలను వారు మన సారా మద్దతు పలుకుతున్నారా" వంటి ఎన్నో ప్రశ్నలు మన మెదళ్లలో ఉదయిస్తాయి. వాటికి సమాధానమే జోయెల్ ఆండ్రియాస్ రచించిన 'యుద్ధోన్మాది అమెరికా' (అడిక్టెడ్ టు వార్, వై ది యు.ఎస్ కాన్ట్ కిక్ మిలిటరిజమ్). అమెరికా యుద్ధ విధానాలు, నీతి ఇతర దేశాలనే కాకుండా అమెరికన్లను కూడా ఎలా ప్రభావితం చేస్తోందో ఈ పుస్తకం చెబుతుంది.



**యుద్ధోన్మాది అమెరికా, జోయెల్ ఆండ్రియాస్, వెల: 100/-, పేజీలు:72, ప్రతులకు: లిఖిత, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్. ఫోన్: 040-2766000**

అమెరికాతో అణు ఒప్పందం కుదుర్చుకోవాలని మనదేశ నేతలు ఎంతగానో ఉబలాటపడుతున్న ప్రస్తుత నేపథ్యంలో అమెరికా అసలు భయానక రూపాన్ని, విధ్వంసక స్వభావాన్ని...తెలుసుకోవాలి. దాని వెనుకే నీడలా పొంచివున్న పెనుప్రమాదాన్ని పసిగట్టాలి. అమెరికా చరిత్ర ఈ విషయాన్నే చెబుతుంది. అది ప్రపంచవ్యాప్తంగా ఎన్నో దేశాలలో జోక్యం చేసుకొని వాటి ఆర్థిక వ్యవస్థను, సమాజాలను, సంస్కృతిని సర్వనాశనం చేసింది. అమెరికాలో స్థానికులైన నేటివ్ ఇండియన్లను కూడా అది వదిలిపెట్టలేదంటే దాని అసలు స్వరూపం తెలుస్తోంది. అలాంటి విశ్వవిధ్వంసకారి అయిన అమెరికా మన భారతదేశం రాబోతోంది. అయితే విరోధిగా కాదు. మిత్రుడిగా. అణు ఒప్పందం పేరుతో. అది శత్రువుగా వుంటే ప్రమాదకరం. మిత్రుడిగా వుంటే ప్రాణాంతకం అన్న విషయాన్ని అమెరికా దాడికి గురైన ఏ దేశాన్ని చూసినా ఇట్టే తెలిసిపోతుంది. జోయల్ ఆండ్రియాస్ బొమ్మలతో రాసిన ఈ పుస్తకం ఆ విషయాన్ని చక్కగా వివరిస్తుంది. పైగా అమెరికా కార్పొరేట్ సంస్థల ఆర్థిక ప్రయోజనాలతో దాని మిలటరీ విధానాలు గట్టిగా ముడిపడి వున్నాయన్న విషయాన్ని అర్థమయ్యేలా వివరిస్తుంది. ప్రపంచ సామ్రాజ్యవాదశక్తి అసలు రూపాన్ని అర్థం చేసుకోవడానికి ఈ పుస్తకం ఎంతగానో ఉపయోగపడుతుంది.

కె.సురేష్ అనువాదం చక్కగా చదివిస్తుంది. సందీప్ పాండే, రమా ఎస్ మెల్కోటె, ప్రచురణకర్తల ముందు మాటలు అమెరికాకు సంబంధించిన అదనపు సమాచారాన్ని అందిస్తాయి. పుస్తకంలో చిట్టచివర ఇచ్చిన 'ఓటమి' కథ ... పెట్రోలు కోసం అమెరికా జరుపుతున్న పోరును కళ్లకు కడుతుంది.

అయితే కమ్యూనిస్టుల పట్ల వ్యతిరేకత కూడా ఈ పుస్తకంలో కనిపిస్తుంది. సామ్రాజ్యవాదులను మొదటినుంచి స్థిరంగా వ్యతిరేకిస్తున్న కమ్యూనిస్టుల పట్ల ఆ ధోరణి తగదు. అది సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలను బలహీన పరుస్తుందన్నది అక్షర సత్యం.

**- అంజన .కె**



కవిత్వం

### హృదయమే వదనం

ఎన్. అరుణ

వెల:60/-,

పేజీలు:73

ప్రతులకు:

విశాలాంధ్ర పబ్లిషింగ్‌హౌస్,

విజ్ఞాన్ భవన్,హైదరాబాద్.

ఇస్లాంవాద కవితా సంకలనం

### కవాతు

ఉగ్రవాదంపై నిరసన కవిత్వం

సంపాదకులు: షేక్ కరీముల్లా

వెల:40/-, పేజీలు:112

ప్రతులకు: షేక్ కరీముల్లా, 21-36, పెద్ద మసీదు బజారు, వినుకొండ, గుంటూరు.




## ఏరుకున్నంత!! దొరికినంత!!!




నానీల పీఠికా ప్రస్తానం (డా॥ ఎన్. గోపి కవితా రూపసృష్టి) సంపాదకులు : డా॥ పత్తిపాక మోహన్, పేజీలు: 196, వెల: 100/-, ప్రతులకు: డా॥ పత్తిపాక మోహన్ 'మారసం' సిరిసిల్ల-505301., అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు.

**20-25** అక్షరాల విస్తీర్ణం కల చట్రంలో 20 అక్షరాలకు తగ్గకుండా 25 అక్షరాలకు మించకుండా చిట్టి పద్యాల రూపంలో 'నానీ' లొచ్చి రసికులను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. భావాంశం, సమర్థత, హేతుబద్ధత, లెక్కలూ గట్రా గమనించని కలాలు పుంఖాను పుంఖాలుగా రాసి పారేస్తున్న తరుణంలో అసలు నానీల 'నిర్మాణ పథకం' ఇదయ్యా బాబూ అని విశదీకరిస్తూ 196 పేజీల నిండా 'చిట్టి పొట్టి ఆశ్చర్యాలు' విశాలంగా వ్యాపించి ఆలోచింప చేస్తాయి. అలనాడు ఆరుద్రగారి కూనలమ్మ పదాలూ, బాపు రమ్య చిత్రాలూ తెలుగు వాళ్లను తట్టి మరీ లేపి కూర్చో బెట్టాయి. ఈనాడు నానీలు 'ఝట్కాలు' కొట్టి పలకరిస్తున్నాయి. కొన్ని అందాలు గమనించక తప్పదు.

"జీవిత ఖైదు అంటే/జీవితాన్ని/కాలానికి/వేలాడదీయటమే"

'ప్రేమకు అర్థాలు/ వెదుకుతున్నావా/ చూడాల్సింది నిఘంటువు కాదు /అమ్మ ముఖం"

"అందరికీ మామ/ చందమామ/ కాని, ఏ ఒక్కరికీ/ పిల్లనివ్వడు"

"కోడలేమో/ కిరోసిన్ డబ్బా/ మరి అత్తేమో/అగ్గిపుల్ల" మనసూ, గుండె, చేలూ, నీరు, పిట్టలూ, గుట్టలూ... సబ్బు బిళ్ళా, కుక్కపిల్లా, ఏదీ అనర్హం కాని 'చిటికెడు' కవితా వస్తువుల్లో 'నానీ'ల పంట పండుతూ ఉంది.ఎరువుల కరువు లేదు మరి.

"పోచంపల్లి చీర/ ఎంత బాగుందో/మరి / దానిని నేసిన వాడు?" అని ప్రశ్నించే కలం....

"సముద్రంలో / ఎంత సర్ఫ్ పోలికిందో /ఎన్నటికీ తరగని /నురగలు" అని చమత్కరించే భావచిత్రాలూ... ఇంకా ఆరిపోని రంగు రంగుల ఇంద్రధనస్సులో చిన్న ప్రశ్న మిణుకు మిణుకు మంటుంది.

"తెల్లు మహాసభల్లో వెలిగేది ఆంగ్లం"

హా ఎవర్ నానీ ఈజ్ ఈజీ మనీ....

196 పేజీల నిండా అవే...! ఏరుకున్నంత!! దొరికినంత!!!

**-డా॥ జె.పి. వైద్య**

# నువ్వా! నేనా!!

కోడి పందేలు, ఎడ్ల పందేలకు మన పల్లెల్లో ఎంత క్రేజ్ వుందో తెల్సు కదా. వాటిమీద పందేలు కాసి సర్వం కోల్పోయి రోడ్డున పడ్డవాళ్లను కూడా చూస్తుంటాం. ఆఫ్ఘనిస్తాన్‌లో ఒంటెల పందేలకు కూడా అంతే క్రేజ్ వుంది. వీటిని చూడ్డానికి జనాలు పిచ్చ పిచ్చగా ఎగబడతారు. ఇక అసలు విషయానికి వద్దాం. బరిలోకి దిగిన ఒంటెలు నురగలు కక్కుతూ... కోపంతో బుసలు కొడుతూ... ఎదుటి ఒంటెను తన పళ్లతో  చీల్చాలని చూస్తాయి. శత్రువును కూల్చివేసి గిట్టలతో బలంగా గుద్దుతూ... పళ్లతో  రక్కాలని చూస్తాయి. ఏ ఒంటె అయితే ముందుగా తన ప్రత్యర్థిని పళ్లతో గాయపరుస్తుందో అది గెల్చినట్టు మైకులో ప్రకటిస్తారు. చిన్నపిల్లలను దానిమీద ఎక్కించి ఊరేగిస్తారు. దెబ్బతిన్న ఒంటె ఓడిపోయినట్టు.





# ట్రిక్ ఫొటోలు

కళ్లతో చూస్తున్నా నమ్మబుద్ధి కావడంలేదే. మనుషులు ఇంత చిన్నగా వుంటారా! కొంపదీసి లిల్లీపుట్లు కాదు కదా' అన్న అనుమానం కలుగుతోందికదూ. మీరు చూస్తున్నది నిజమే. అయితే మీరు అనుకునేది మాత్రం నిజం కాదు. 'అదేంటి మళ్లీ రెండూ పూర్తి విరుద్ధంగా చెప్తారు? అదెలా సాధ్యం?!' అంటారా? ఎలాగంటే... ఇవి ట్రిక్ ఫొటోలు కాబట్టి. మనలాంటి మనుషులనే ఎంత దూరంలో పెట్టి తీస్తే ఇలాంటి ఫొటోలు తీయవచ్చో ఆలోచించి తీస్తారు. కావాలంటే మీరూ ప్రయత్నించి చూడండి. అందుకు కావాల్సిందల్లా ఒక కెమేరా...సృజనాత్మకత. కాదంటారా!

కథా నిలయం
శ్రీకాకుళం

# కలం స్నేహం

హాయ్ చిన్నారి నేస్తాలూ!

**మీ**క్కూడా వీళ్లలాగా కలంస్నేహం చెయ్యాలని ఉందా? మరి ఆలస్యం ఎందుకు? ఒక పోస్ట్‌కార్డు తీసుకుని మీ పేరు, వయసు, తరగతి, స్కూలు, హాబీలు, చిరునామా రాయండి. ఆ తర్వాత మీ కలర్‌ఫొటోను అతికించి పోస్టు చెయ్యండి. అంతే ఎంచక్కా ప్రచురిస్తాం. అన్నట్టు, ఈ పుస్తకాన్ని మీ స్నేహితులకూ చూపించి అన్ని విషయాలూ చెప్పండి. వాళ్లకు కూడా కలంస్నేహం చెయ్యాలని వుంటే కార్డు మీద రాసి మాకు పంపమనండే. మరి మా అడ్రస్: కలం స్నేహం, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.

**పేరు :** బి. సంధ్య
**చదువు:** 5వ తరగతి
**వయసు:** 10 సం॥
**స్కూలు :** శ్రీ వాణి విద్యాలయం, యుపిఎస్, నంగునూరు
**లక్ష్యం:** డాక్టర్ కావడం
**హాబీలు :** పుస్తకాలు చదవడం, ఆటలు ఆడటం, టీవీ చూడడం
**చిరునామా :** బి. సంధ్య, డాటరాఫ్: యాదగిరి, గణపురం, నంగునూరు, మెదక్.

**పేరు :** బత్తుల సుమన్
**చదువు:** 6వ తరగతి
**వయసు:** 11 సం॥
**స్కూలు :** శ్రీవాణి విద్యాలయం యుపిఎస్, నంగునూరు.
**లక్ష్యం:** డాక్టర్ కావడం
**హాబీలు :** పుస్తకాలు చదవడం, టీవీ చూడడం, క్రికెట్ ఆడడం
**చిరునామా :** బి. సుమన్, సన్నాఫ్: శ్రీనివాస్, గణపురం, నంగునూరు, మెదక్.

**పేరు :** కె.పల్లవి
**చదువు:** యు.కె.జి
**వయసు:** 5 సం॥
**స్కూలు :** పేరు రాయలేదు
**లక్ష్యం:** డాక్టర్ కావడం
**హాబీలు :** పాటలు పాడడం
**చిరునామా :** కె. పల్లవి, డాటరాఫ్: నాగభూషణం, 1-587-ఎ, బి.టి. కాలేజి రోడ్, మదనపల్లి, చిత్తూరు.

**పేరు :** బేతిగంటి అఖిల
**చదువు:** 7వ తరగతి
**వయసు:** 12 సం॥
**స్కూలు :** శ్రీవాణి విద్యాలయం,యుపిఎస్, నంగునూరు.
**లక్ష్యం:** టీచర్ కావడం
**హాబీలు :** చదవడం, టీవీ చూడడం
**చిరునామా :** బి. అఖిల, డాటరాఫ్: బి. మల్లేశం, సిద్దన్నపేట, నంగునూరు, మెదక్.

**పేరు :** ఇ. పుణ్యవతి
**చదువు:** 10వ తరగతి
**వయసు:** 15 సం॥
**స్కూలు :** జెడ్.పి.ఎస్.ఎస్. స్కూల్, గూడూరు
**లక్ష్యం:** మదర్ థెరిస్సాలా సేవ చేయడం
**హాబీలు :** పేపర్ చదవడం, పుస్తకాలు చదవడం.
**చిరునామా :** ఇ. పుణ్యవతి, గూడూరు, నర్సంపేట, వరంగల్.

**పేరు :** పులి సాయికృష్ణ ప్రసాద్
**చదువు :** ఎల్.కె.జి
**వయసు:** 4 సం॥
**స్కూలు :** వివేకానంద పాఠశాల, తాడ్వాయి
**లక్ష్యం:** కంప్యూటర్ ఇంజనీర్ కావడం
**హాబీలు :** టీవీ చూడడం, కార్టూన్ చానల్ చూడడం
**చిరునామా :** పులిసాయికృష్ణ ప్రసాద్, సన్నాఫ్: గురుదాస్, తాడ్వాయి, నిజామాబాద్.